# బల్కంపేట అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ..

**మెహిదీపట్నం, జులై 24, ప్రభాతవార్త :**
ఆషాడ మాస బోనాల ఉత్సవాలలో భాగంగా ప్రతి ఏడు మాదిరిగానే ఈ ఏడాది కూడా గోల్కొండ దేవాలయ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్ జయ దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం బల్కంపేట అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుల చంద్రశేఖర్ మాట్లాడుతూ... చారిత్రాత్మక గోల్కొండ కోట శ్రీ జగదాంబ మహంకాళి దేవాలయం నుంచి బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని బల్కంపేట అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్రాన్ని సుభిక్షంగా చూడాలని, సకాలంలో వర్షాలు కురవాలని వేడుకోవడం జరిగిందన్నారు. పట్టు వస్త్రాలు సమర్పించిన వారిలో ఆలయ కమిటీ సభ్యులు దూసరి వివేక్ గౌడ్, జి. భరత్, కె. గీత, ఆకుల భాగ్యలతలు ఉన్నారు.


పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న గోల్కొండ దేవాలయ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్.



హైదరాబాద్ వార్త

# నగరవాసికి.. ని'శ్శబ్ద ప్రమాదం'!



- ఉక్కిరిబిక్కిరి చేస్తున్న 'శబ్ద కాలుష్యం'
- హారన్ల హోరు.. నిర్మాణాల మోత.. లౌడ్‌స్పీకర్ల గోల
- హెచ్‌సీయూ గచ్చిబౌలిలో అత్యధిక మోత మోగుతోంది

**జూబ్లీహిల్స్, జులై 24, ప్రభాతవార్త:**
నగర వాసులను వారికి తెలియకుండా నిశబ్ధంగా ఒక ప్రమాదం వెంటాడుతుంది.. ఇంట్లో ఉన్నా, బయటకు వెళ్లినా ఈ ప్రమాద తీవ్రత రోజురోజుకు పెరుగుతూనే ఉంది.. నగర జీవనంలో చోటు చేసుకుంటున్న మార్పులు, చోటుచేసుకుంటున్న పరిణామాలు వాయు కాలుష్యంతోపాటు శబ్ధ కాలుష్యాన్ని కలగజేస్తున్నాయి.. కాలుష్య నియంత్రణ మండలి(పిసిబి) ఈ ఏడాది జూన్ వరకు తాజాగా విడుదల చేసిన ఘనాంకాలు ఇదే అంశాన్ని తెలియ జేస్తున్నాయి.. హెచ్‌సీయూ-గచ్చిబౌళి ప్రాంతాలు నిశబ్ధ ప్రాంతాలైనప్పటికి ఇక్కడ శబ్దం మోత తీవ్రంగా ఉంది. అలాగే జేఎన్‌టీయూ వాణిజ్య ప్రాంతాల్లోనూ ఈ తీవ్రత ఎక్కువగా ఉండగా, వాణిజ్య ప్రాంతమైన అబిడ్స్‌లో ఈ తీవ్రత తక్కువగా ఉండటం గమనార్హం.. జూబ్లీహిల్స్‌లాంటి ప్రాంతంలో ప్రమాణాలకు మించి కొంచం ఎక్కువగా ఉండగా, పారిశ్రామిక ప్రాంతమైన జీడిమెట్లలో వీటన్నింటికి భిన్నంగా కాస్త మెరుగ్గా కనిపించడం గమనార్హం. ఒకవైపు వాహన కాలుష్య తీవ్రతకు తోడు ఇప్పుడు పెరుగుతున్న శబ్ధ కాలుష్య తీవ్రత నగరవాసుల ఆరోగ్యంపై ఆందోళణను కలిగిస్తుంది.

**వెంటాడుతున్నాయి..**
నగరవాసిని వెంటాడుతున్న ప్రధాన సమస్యల్లో శబ్ధ కాలుష్యం ఒకటిగా మారింది. ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద విచక్షణారహితంగా మోగిస్తున్న హారన్లు, మెట్రో, ఫ్లైఓవర్ నిర్మాణాల మోత, డీజిల్ జనరేటర్ల శబ్ధాలు, ఫంక్షన్ హాల్స్, లౌడ్‌స్పీకర్లు, పండుగల సందర్భంగా భారీ సౌండ్ సిస్టమ్‌లు... ఇలా నగరంలో నిశ్శబ్దం అనే మాటే కనుమరుగవుతోంది. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) నిర్వహించిన పరిశీలనల్లో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శబ్ధ తీవ్రత నిర్ణీత ప్రమాణాలను దాటినట్లు స్పష్టమవుతుంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ, పంజాగుట్ట, అమీర్‌పేట్, సికింద్రాబాద్, కోఠి, చార్మినార్ వంటి రద్దీ ప్రాంతాల్లో పగలు, రాత్రి వేళల్లో అనుమతించిన పరిమితిని మించి డెసిబెల్స్ నమోదవుతున్నాయి.

**నివాస ప్రాంతాల్లో మోతలు మోగుతున్నాయి**
కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం నివాస ప్రాంతాల్లో పగటి వేళల్లో 55 డెసిబెల్స్, రాత్రి 45 డెసిబెల్స్ మాత్రమే ఉండాలి. ఆసుపత్రులు, పాఠశాలలు వంటి నిశ్శబ్ద ప్రాంతాల్లో పగలు 50, రాత్రి 40 డెసిబెల్స్ మించకూడదు. అయితే నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ పరిమితులు తరచుగా దాటిపోతున్నాయి. ట్రాఫిక్ జంక్షన్ల వద్ద 70 నుంచి 85 డెసిబెల్స్ వరకు శబ్దం నమోదవుతుండగా, హారన్ మోగిన ప్రతిసారి 90 నుంచి 110 డెసిబెల్స్ వరకు చేరుతోంది. ఇది కొంత వరకు ఆందోళన కలిగిస్తుంది.

**కూడళ్లలో ధ్వని**
ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ముందున్న వాహనం కదలకముందే హారన్ మోగించడం ఇప్పుడు అలవాటుగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే వినియోగించాల్సిన హారన్లు, అనవసరంగా మోగించడం వల్ల శబ్ధ కాలుష్యం మరింత పెరుగుతోంది. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో నిమిషానికి వందలాది హారన్లు వినిపించడం సాధారణంగా మారింది. నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్మాణ పనులు రాత్రి వేళల్లోనూ కొనసాగుతున్నాయి. డీజిల్ జనరేటర్లు, ఫంక్షన్ హాల్స్, బార్లు, పబ్‌లు, లౌడ్‌స్పీకర్ల కారణంగా అర్ధరాత్రి వరకు భారీ శబ్దాలు వినిపిస్తున్నాయని కాలనీవాసులు చెబుతున్నారు. ఆస్పత్రులు, విద్యాసంస్థల పరిసరాల్లో సైలెన్స్ జోన్ నిబంధనలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తమవుతోంది. దీనికితోడు షేక్‌పేట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అవుటర్‌లపై ఇప్పుడు వాహనదారులు వీలింగ్ పేరుతో చేస్తున్న ప్రయోగాలు, సాహసాలు, శబ్ధ విన్యాసాలు నగరవాసులను కలవరపెడుతున్నాయి.

**ఆరోగ్యానికి ముప్పు**
శబ్ధ కాలుష్యం ప్రభావం అప్పటికప్పుడు కనిపించకపోయినా, దీర్ఘ కాలంలో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం నిరంతరం అధిక శబ్దానికి గురికావడం వల్ల వినికిడి శక్తి తగ్గడం, చెవిలో మోత, అధిక రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు, నిద్రలేమి, ఒత్తిడి, మానసిక ఆందోళన వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారిపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు, ఇంటి నుంచే పనిచేస్తున్న ఉద్యోగులు శబ్ధ కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిరంతర శబ్దం కారణంగా ఏకాగ్రత దెబ్బతింటోందని, పనితీరు తగ్గుతోందంటున్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్‌స్పీకర్ల వినియోగంపై పరిమితులు ఉన్నాయి. ఆస్పత్రులు, పాఠశాలలు, కోర్టుల చుట్టూ 100 మీటర్ల పరిధిని సైలెన్స్ జోన్‌గా గుర్తిస్తారు. అక్కడ అనవసరంగా హారన్లు మోగించడం, అధిక శబ్దం చేయడం నిబంధనలకు విరుద్ధం. అయినా ఇవేవి పట్టించుకోకుండా కొందరు అదేపనిగా మోతలు మోగిస్తున్నారు.

**తెలంగాణ వాయుష్య నియంత్రణ మండలి విడుదల చేసిన వివరాల ప్రకారం..**

| ప్రాంతం | సాధారణం | జనవరి | ఫిబ్రవరి | మార్చి | ఏప్రిల్ | మే | జూన్ |
|---|---|---|---|---|---|---|---|
| జూబ్లీహిల్స్ | 55 | 58.34 | 59.49 | 58.04 | 57.42 | 56.91 | 56.69 |
| తార్నాక | 55 | 60.75 | 60.18 | 60.46 | 59.25 | 59.55 | 59.78 |
| అబిడ్స్ | 65 | 64.58 | 63.02 | 56.35 | 54.83 | 54.58 | 60.37 |
| జేఎన్‌టీయూ | 65 | 71.26 | 71.30 | 70.83 | 70.43 | 69.42 | 69.09 |
| సనత్‌నగర్ | 75 | 69.74 | 69.83 | 69.47 | 69.46 | 69.22 | 69.93 |
| జీడిమెట్ల | 75 | 65.02 | 65.60 | 64.94 | 64.62 | 64.23 | 65.57 |
| గడ్డపోతారం | 75 | 71.46 | 70.43 | 66.91 | 60.63 | 60.53 | 64.60 |
| జూపార్క్ | 50 | 56.62 | 54.09 | 56.53 | 56.99 | 58.92 | 62.10 |
| హెచ్‌సీయూ (గచ్చిబౌలి) (నిశబ్ద ప్రాంతం) | 50 | 70.63 | 71.64 | 71.03 | 68.67 | 69.79 | 70.59 |

# వర్షపు నీటి సంరక్షణలో కోఆప్ బ్యాంక్ కాలనీ నగరానికే ఆదర్శం

**ప్రతి ఇంటిలో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్‌కు పిలుపు**



జలమండలి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యాలు

**హైదరాబాద్, జులై 24, ప్రభాతవార్త**
వర్షపు నీటి సంరక్షణ ద్వారా భూగర్భ జలాలను కాపాడడంతో పాటు భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించాలనే లక్ష్యంతో హైదరాబాద్ జలమండలి ఆధ్వర్యంలో నాగోల్‌లోని కోఆప్ బ్యాంక్ కాలనీ లో శుక్రవారం అవగాహన ర్యాలీ, సమావేశం, ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జలమండలి అధికారులు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, ఎన్‌జీఓ సభ్యులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని వర్షపు నీటి సంరక్షణ ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. నాగోల్ గ్రామ పరిధిలో మూసీ నదికి దక్షిణంగా ఉన్న కోఆప్ బ్యాంక్ కాలనీలో సుమారు 400 గృహాలు ఉన్నాయి. కాలనీలో భూగర్భ జలాలను పరిరక్షించేందుకు 2012లో రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు జలమండలి భూగర్భ జల నిపుణులు సాంకేతిక మార్గదర్శకత్వం అందించారు. ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలు ఏర్పాటు చేయాలని సూచించడంతో పాటు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కృషి ఫలితంగా ప్రస్తుతం కాలనీలో సుమా రు 80 శాతం గృహాల్లో పైకప్పుపై పడే వర్షపు నీటిని ప్రత్యేక రీచార్జ్ నిర్మాణాల్లోకి మళ్లించే వ్యవస్థ లు ఏర్పాటు చేశారు. దీంతో వర్షాకాలం అనంతరం బోర్‌వెల్లలో నీటి లభ్యత గణనీయంగా పెరగ డంతో పాటు భూగర్భ జలమట్టం స్థిరంగా కొనసాగుతోందని అధికారులు తెలిపారు. జలమండలి నిపుణుల సూచనల మేరకు కొత్త బోర్‌వెల్లను 60 మీటర్ల కంటే ఎక్కువ లోతులో తవ్వకూడదని కాలనీ వాసులు స్వచ్ఛందంగా నిర్ణయం తీసుకుని ఇప్పటికీ అమలు చేస్తున్నారు. కొత్తగా ఇళ్లు నిర్మించే వారు కూడా రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకునేలా, అధిక లోతులో బోర్‌వె ల్లు తవ్వకుండా ఉండేలా కాలనీ సంఘం నిరంతరం అవగాహన కల్పిస్తోంది. అదనంగా, 2016లో జలమండలి చేపట్టిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కాలనీలోని సామూహిక ప్రదేశాల్లో మూడు వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను ఏర్పాటు చేసింది. అలాగే కాలనీ వాసులు పెద్దఎత్తున మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించడంతో పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటంతో పాటు వేసవికాలంలోనూ చల్లని వాతావరణాన్ని కొనసాగించేలా కృషి చేస్తున్నారు. కోఆప్ బ్యాంక్ కాలనీ సాధించిన ఈ విజయాన్ని నగరంలోని ఇతర కాలనీలకు ఆదర్శంగా పరిచయం చేయడం, వర్షపు నీటి సంరక్షణపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించడమే లక్ష్యంగా జలమండలి, కోఆప్ బ్యాంక్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, సీడ్ స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్ర మాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా జలమండలి అధికారులు మాట్లాడుతూ ప్రతి ఇంటిలో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భ జలాలను సంరక్షి ంచ డంతో పాటు భవిష్యత్ తరాలకు నీటి భద్రతను అందించవచ్చని తెలిపారు. కోఆప్ బ్యాంక్ కాలనీ అమలు చేసిన విధానాలను నగరంలోని ప్రతి కాలనీ ఆదర్శంగా తీసుకుని వర్షపు నీటి సంరక్షణకు ముందుకు రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి డైరెక్టర్ (ఆపరేషన్స్) వాసా సత్యనారాయణ, డైరెక్టర్ (రెవెన్యూ) కిరణ్ కుమార్, చీఫ్ జనరల్ మేనేజర్ నాగేంద్రకుమార్, జనరల్ మేనేజర్ మహేంద్ర నాయక్, భూగర్భ జల నిపుణులు జాల సత్యనారాయణ, సంబంధిత డిప్యూటీ జనరల్ మేనేజర్, మేనేజర్, సీడ్ సంస్థ ప్రతినిధి నాగబ్రహ్మాచారి, కోఆప్ బ్యాంక్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ కుమార్, కార్యదర్శి లవకుశ రెడ్డితో పాటు ఆర్‌డబ్ల్యూఏ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# నకిలీ, ట్యాంపరింగ్ నంబర్ ప్లేట్లపై

## ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం




**హైదరాబాద్, జులై 25, ప్రభాతవార్త**
పౌరుల నుంచి వచ్చిన ఫిర్యాదులు పెరిగిన నేపథ్యంలో, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నకిలీ, ట్యాంపరింగ్ మోసపూరిత రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న వాహనాలపై ప్రత్యేక తనిఖీలను తీవ్రతరం చేశారు. ఇటువంటి చర్యలు మోటారు వాహనాల చట్టం మరియు ఇతర సంబంధిత వర్తించే చట్టపరమైన నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమే అవుతుంది. ఈ నిరంతర చర్యలలో భాగంగా, వాహనాల గుర్తింపును దాచడం, ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకోవడం మరియు నిబంధనలను ఉల్లంఘించడమే లక్ష్యంగా మోసపూరిత రిజిస్ట్రేషన్ ప్లేట్లను ఉపయోగిస్తున్న వ్యక్తులపై గత వారంలో ఆరు నేరపూరిత కేసులు నమోదయ్యాయి. ఈ ఆపరేషన్ సమయంలో నిబంధనలు ఉల్లంఘించిన పలు వాహనాలను గుర్తించి జప్తు చేశారు. ఈ నేరపూరిత కేసులు జూబ్లీహిల్స్, మలక్‌పేట్, బేగంబజార్, అబిడ్స్, కాచిగూడ తదితర లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదయ్యాయి. ఈ తనిఖీల నేపథ్యంలో, ప్రభుత్వం ఆమోదించిన హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు మాత్రమే చట్టబద్ధమైనవని ట్రాఫిక్ పోలీస్ విభాగం స్పష్టం చేస్తోంది. నంబర్ ప్లేట్లలో ఎలాంటి మార్పులు చేసినా, అంకెలు సరిగ్గా కనిపించకుండా దాచినా, లేదా తాత్కాలిక స్టిక్కర్లు ఉపయోగించినా అవన్నీ చట్టవిరుద్ధమని మరియు వారిపై తక్షణ చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. మోసపూరిత వాహన రిజిస్ట్రేషన్ విధానాలపై 'జీరో టాలరెన్స్' (సహించేది లేని) విధానాన్ని పునరుద్ఘాటిస్తూ, నకిలీ లేదా ట్యాంపరింగ్ చేసిన రిజిస్ట్రేషన్ ప్లేట్లను ఉపయోగించడం వల్ల నేరపూరిత ప్రాసిక్యూషన్ మరియు వాహనాన్ని తక్షణమే సీజ్ చేయడంతో సహా తీవ్రమైన చట్టపరమైన పర్యవసానాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ పోలీసులు ప్రజలను హెచ్చరిస్తున్నారు. వాహన యజమానులందరూ నిబంధనలకు లోబడి నంబర్ ప్లేట్లను అమర్చుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని పోలీస్ శాఖ విజ్ఞప్తి చేస్తోంది. ప్రజా భద్రత, చట్టబద్ధమైన రహదారి వినియోగం మరియు నేరాల నియంత్రణను నిర్ధారించడానికి నగర వ్యాప్తంగా ఈ తనిఖీ డ్రైవ్‌లు నిరంతరం కఠినంగా కొనసాగుతాయని జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) డి. జోయల్ డేవిస్ స్పష్టం చేశారు.

# ప్రశ్నిస్తే దేశ ద్రోహులం అవుతామా

**-ఓట్లు వేసిన వారికి ప్రశ్నించే హక్కు లేదా?**

**-నిరసన కార్యక్రమంలో విద్యార్థుల ఆవేదన**


నిరసన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న విద్యార్థిని

**ధర్నాచౌక్, జులై 24, ప్రభాతవార్త:**
విద్యావ్యవస్థ వైఫల్యం చెందినప్పుడు విద్యార్థుల పక్షాన ప్రశ్నిస్తే దేశ ద్రోహులు అవుతారా అని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో కేటీఆర్ చేపట్టిన నిరసన కార్యక్రమంకు మద్దతుగా మహిళా విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఇండియాలో ఎప్పుడు మంచి రోజులు వస్తాయని ప్రశ్నించారు. మన దేశంలో ప్రజాస్వామ్యం ఎక్కడ ఉందని ప్రశ్నించారు. పోక్సో కేసులో అరెస్ట్ అయిన బీజేపీ నేత కొడుక్కి బెయిల్ వచ్చినంత తొందరగా నీట్ విద్యార్థులకు న్యాయం జరగటం లేదని ధ్వజమెత్తారు.

# విద్యాసంస్థల బంద్ విజయవంతం

**-నిరసనలో పాల్గొన్న పలు విద్యార్థి సంఘాల నేతలు**


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

**సైఫాబాద్, జులై 24, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విజయవంతం అయిందని విద్యార్థి సంఘాల నేతలు స్పష్టం చేశారు. శుక్రవారం నీట్ పరీక్షల నిర్వహణలో వరుస వైఫల్యాలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, అవకతవకలు, విద్యార్థుల ప్రాణాలు బలిగొన్న ఘటనలకు రాజకీయ, నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల పిలుపు మేరకు తెలంగాణ వ్యాప్తంగా విద్యాసంస్థలు మూసివేశారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విద్యార్థులు, యువజనులు, ప్రజాసంఘాల నేతలు పెద్ద ఎత్తున బంద్‌లో పాల్గొన్నారు.

# నగరంలో ఎక్కడ చూసినా జ్వరాలే

- -ఏ ఆస్పత్రి చూసినా రోగులతో కిటకిట
- -చాపకింద నీరులా పాకుతున్న వైరల్ జ్వరాలు
- -అధికమవుతున్న టైఫాయిడ్, డెంగీ, మలేరియా
- -పారిశుధ్య లోపం..దోమల స్వైర విహారం
- -జ్వరాలతో విలవిల.. ఓపీలు కిటకిట

**హైదరాబాద్, జులై 24, ప్రభాతవార్త**
వైరల్ ఫీవర్..వైరల్ ఫీవర్..ఎవరిని పలకరించినా ఇదే మాట చెబుతున్నారు. తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు, తల నొప్పితో పాటు జలుబు, గొంతునొప్పి వంటి లక్షణాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏ ఆస్పత్రి చూసినా జ్వరాల బారిన పడిన రోగులతో కిటకిటలాడుతోంది. వైరల్ జ్వరాలతో పాటు టైఫాయిడ్, మలేరియా, చికున్‌గున్యా, డెంగీ వంటి జ్వరాలు కూడా ప్రబలుతున్నాయి. ఫీవర్ సర్వే చేస్తున్నామం టూ అధికారులు ఊదరగొడుతున్నా..క్షేత్రస్థాయిలో ఇలాంటి సర్వే చేస్తున్న జాడే కనిపించట్లేదు. గతేడాది లాగా బస్తీలు, కాలనీల్లో హెల్త్ క్యాంపులు కనిపించడంలేదు. ఒకవేళ ఉన్నా.. ఇక్కడో క్యాంపు పెట్టి మమ అనిపించేస్తున్నారు. ఇక, వైద్యాధికారులను గట్టిగా అడిగితే మాత్రం..ఈ సీజన్‌లో జ్వరాలు కామన్..అంటూ సమాధానం దాటేస్తున్నారు.


రోగులతో కిటకిటలాడుతున్న నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రి

**దోమల బెడద పట్టదా..?**
నగరవ్యాప్తంగా దోమల బెడద తీవ్రమైంది. బస్తీలు, కాలనీల్లో దోమలు స్వైర విహారం చేస్తున్నా పట్టించుకున్న నాథుడే కనిపించట్లేదు. దోమల వ్యాప్తి ద్వారా ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి జ్వరాలు వస్తున్నాయి. ఎప్పుడో ఒకసారి ఇలా వచ్చి దోమల పొగ స్ప్రేచేసి వెళ్తున్నా..దోమలను పూర్తి స్థాయిలో నివారించే చర్యలేవి కనిపించట్లేదు. దీంతో అనేక మంది జ్వరాల బారినపడుతున్నారు. ఎంఎంసి, జిహెచ్‌ఎంసి, సిఎంసి మున్సిపల్ కార్పొరేషన్లలో ఈ పరిస్థితి నెలకొంది.

**ఫీవర్‌కు పెరిగిన తాకిడి..**
అపరిశుభ్ర వాతావరణం, కురుస్తున్న వర్షాల ప్రభావంతో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. టైఫాయిడ్, డెంగీ, వైరల్ ఫీవర్లతో బాధపడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. రక్త పరీక్షల్లో మాత్రం అధికంగా వైరల్ ఫీవర్ కేసులే తేలుతున్నాయి. ఓపీతో పాటు ఇన్‌పేషంట్లుగా చేరే వారి సంఖ్య కూడా ఇటీవల పెరిగింది. ఇక.నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి జ్వరాల బాధితులతో కిక్కిరిస్తోంది. ఆస్పత్రికి వస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ప్రతి రోజు 800కు పైగా ఓపీ నమోదవుతోంది. రోజుకు 20 నుంచి 45 మంది వరకు ఇన్‌పేషంట్లుగా చేరుతున్నారు. దీంతో మెడికల్ వార్డులు రోగులతో నిండిపోతున్నాయి. గతంలో 400 నుంచి 600 వరకు ఉన్న ఔట్‌పేషెంట్లు ఇప్పుడు 900కు చేరింది. అలాగే ఆయా ప్రాంతాల్లోని బస్తీలు, కాలనీల్లోని యూపీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాల్లో వైద్యం కోసం ఆశ్రయిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. ప్రైవేటు క్లినిక్‌లు, ఆస్పత్రు లకు వెళ్లి అడ్మిషన్ పొందుతున్న వారు కూడా ఎక్కువే ఉన్నారు.

**పిల్లలపై ప్రభావం అధికమే..**
వర్షాలు, కలుషిత వాతావరణ ప్రభావంతో వస్తున్న విష జ్వరాల బాధితుల్లో చిన్నారులే అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. బాధితుల్లో సుమారు 40 శాతం మంది పదేళ్లలోపు చిన్నారులే ఉన్నారని చెబుతున్నారు. ఉన్నట్టుండి శరీరం వేడెక్కడం, నీరసం, చలి, గొంతునొప్పి వంటి లక్షణాలతో ఇబ్బంది పడుతున్నారు. పిల్లల ఆసుపత్రి నిలోఫర్‌లో సాధారణంగా ఓపీలో 800-9200 మంది వస్తుంటారు. కానీ, ఇప్పుడు రోజుకు 1,000-1,200 మంది వస్తున్నారు.

# తన్మయుల్ని చేసిన నృత్యవిన్యాసాలు

**నాంపల్లి, జులై 24 ప్రభాతవార్త :**
పువ్వు పుట్టగానే పరిళమించినట్లు భారతీయ సంప్రదాయ నృత్యకళలను ఇతోధికంగా ప్రోత్సహిస్తూ స్థాపించిన మొదటి సంవత్సరంలోనే ఎంతోమందికి నాట్యకళలో అద్భుత శిక్షణిస్తూ స్పేస్ ఫర్ డివైన్ ఆర్ట్ సంస్థ మదసల ప్రథమ వార్షికోత్సవ వేడుకలు సుందరం, సుమధురంగా సాగి విచ్చేసిన అశేష ప్రేక్షకులు, ఔత్సాహిక కళాప్రియులను తన్మయుల్ని చేశాయి. రెందు దశాబ్దాల నాట్యానుభవం ఉన్న గురు సౌజన్య ప్రముఖ గురువులు రుక్మాజీరావు, డా. జయంతి శ్రీధర్, పసుమర్తి రామలింగశాస్త్రిల వద్ద నృత్యశిక్షణ, కళైమామణి ఉమామహేశ్వరి వద్ద కర్ణాటక సంగీతంలో శిక్షణ పొందడం విశేషం. నేటితరానికి భారతీయ సంప్రదాయ శాస్త్రీయ నృత్యాలను అందించడమే లక్ష్యంగా కళాసేవలో నిమగ్నమయ్యారు. ఈమేరకు నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో ప్రముఖ నాట్యాచార్యులు, మదలస సంస్థ వ్యవస్థాపకురాలు సౌజన్య శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆమె శిష్యులు శిష్టా వైష్ణవి, ఎం.లక్ష్మీప్రసన్న, ఏచూరి విష్ణుప్రియ, క్రిష్ట వాహినిలు పలు నృత్యాంశాలను అలవోకగా, అద్భుతంగా ప్రదర్శించి ప్రతీఒక్కరిని ఆకట్టుకున్నారు. ముఖ్యంగా పుష్పాంజలి, అలరిప్పు, గణపతి స్తుతి, నటేశ్వర కౌత్వం వంటి అంశాలను శృతి లయబద్ధంగా అద్భుత హావభావాలను ఒలికిస్తూ తమ నాట్యవిన్యాసాలతో సభికులను మంత్రముగ్ధులను చేసి ప్రశంసలు అందుకుని సంస్థకు పేరుప్రతిష్టలు తీసుకొచ్చారు.


కళాకారుల నృత్యవిన్యాసాల్లో ఒక దృశ్యం

## మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే దానం



మహిళాభవన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్

**జూబ్లీహిల్స్, జూలై 24, ప్రభాతవార్త:** ప్రజల మౌలిక వసతుల రూపకల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్‌లోని గౌరీశంకర్ కాలనీలో రూ.45 లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా భవన్, ఉదయ్‌నగర్‌లో రూ.58 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ, మహిళల సమావేశాలు, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు, సామాజిక కార్యక్రమాలకు మహిళా భవన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అలాగే కమ్యూనిటీ హాల్ స్థానిక ప్రజలకు వివిధ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు వేదికగా నిలుస్తుందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రాములు చౌహాన్‌తోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

## విద్యావ్యవస్థ బాగుపడాలని పోరాడితే తప్పేంటి? : జీవన్ సింగ్



ఇందిరా పార్క్ వద్ద నిరసన తెలుపుతున్న జీవన్ సింగ్ తదితరులు..

**కార్వాన్, జులై24(ప్రభాతవార్త)** విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, వాటిపైఢిల్లీలో జరుగుతున్న ఆందోళనలనకు మద్దత్తుగా భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కార్వాన్ నియోజకవర్గం భారత రాష్ట్ర సమితి పార్టీ ఇంచార్జి ఠాకూర్ జీవన్ సింగ్ ఆధ్వర్యంలో విద్యార్థులు,యువత భారీగా దేరారు.ఈ సందర్భముగా జీవన్ సింగ్ మాట్లాడుతూ ..ప్రజాస్వామ్య దేశంలో ప్రశ్నిస్తే యాంటీ నేషనల్ అవుతారా,విద్యావ్యవస్థ బాగుపడాలని పోరాడితే తప్పేంటి అని ప్రశ్నించారు.కేంద్రంలో బీజేపీ ఉన్నా,కాంగ్రెస్ ఉన్నా,రేపు ఇంకో పార్టీ అధికారంలోకి వచ్చినా తప్పు జరిగితే ప్రశ్నిస్తూనే ఉంటామని అయన అన్నారు.ఈ కార్యక్రమంలో కార్వాన్ నియోజకవర్గం భారత రాష్ట్ర సమితి పార్టీ నేతలు అంబటి శ్రీనివాస్,ముత్యాల భాస్కర్,గున్నాల రంగారెడ్డి, జ్యోతి రాజ్,శివరాత్రి రాములు,దుర్గారాజ్,కనకరాజు పాల్గొన్నారు.

## అక్కన్న మాదన్న మహాకాళీ ఆలయంలో సామూహిక కుంకుమార్చన



సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

**చార్మినార్,జూలై 24 ప్రభాతవార్త :** పాతబస్తీ హరిబౌలిలోని శ్రీ అక్కన్న మాదన్న మహంకాళీ ఆలయ కమిటి ఆధ్వర్యంలో ఆషాడ మాసం సందర్భంగా శుక్రవారం మాతృ మూర్తులచే సామూహిక కుంకుమార్చన,పూజలు ఘనంగా జరిగాయి.కుంకుమార్చన కార్యక్రమంలో పాతనగరంలోని పలు ప్రాంతాలకు చెందిన దాదాపు 600 మంది మహిళలు పాల్గొన్నారు.అమ్మ వారికి అభిషేకం,ప్రత్యేక అలంకరణ,అర్చన,మహాహారతి,పూజలు జరిగాయి.అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.

## ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ వేగవంతం చేయాలి

### జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్



ఎస్ఐఆర్ సర్వేను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్

**దుండిగల్, జూలై 24, ప్రభాతవార్త**

దుండిగల్ సర్కిల్ బౌరంపేట వార్డు పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్2026 (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) ఇంటింటి సర్వేను జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లు నింపిన ఎన్యుమరేషన్ ఫారాలను బీఎల్‌వోలు సేకరిస్తున్న తీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సందర్భంగా సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు)తో మాట్లాడిన జోనల్ కమిషనర్, ఇంకా ఎన్యుమరేషన్ ఫారాలు నింపని ఇళ్లను గుర్తించి వేగంగా సర్వే పూర్తి చేసి ఫారాలను సేకరించాలని ఆదేశించారు. సేకరించిన వివరాలను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్2026 ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహిస్తూ ప్రతి అర్హ ఓటరు వివరాలు నమోదు అయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇంటింటి సర్వేలో ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ వారి సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.ఈ పరిశీలన కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌తో పాటు డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్, నోడల్ అధికారులు, సూపర్వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ



**చిక్కడపల్లి జులై 24 ( ప్రభాతవార్త ) :** రాంనగర్ లో శుక్రవారం గిఫ్ట్ ఎ స్మైల్ కార్యక్రమంలో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గం బి ఆర్ ఎస్ రాంనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు రేషం మల్లేష్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలోనూ ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. వారి సేవలను గుర్తిస్తూ భవిష్యత్తులోనూ సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సిరిగిరి శ్యామ్, రాకం సత్యనారాయణ, జంగం అరుణ్, గాజర్ల రాజేష్, కత్తుల సోను తదితరులు పాల్గొన్నారు.

## రథోత్సవం ఘటనపై విచారణకు ఆదేశించిన మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు



మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

**సంజీవరెడ్డి నగర్, జూలై 24, ప్రభాతవార్త:** బల్కంపేట్ శ్రీ ఎల్లమ్మ-పోచమ్మ తల్లి దేవాలయంలో ఇటీవల జరిగిన రథోత్సవం సందర్భంగా చోటుచేసుకున్న ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేసి, నాలుగు వారాల్లో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఎస్.ఆర్. నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవులపల్లి రవి కిరణ్ శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. రథోత్సవం సందర్భంగా మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ రాక కోసం సుమారు 45 నిమిషాల పాటు ఉత్సవాన్ని ఆలస్యం చేయడంతో భారీ వర్షంలో అమ్మవారు, వేలాది మంది భక్తులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆరోపించారు. ఈ ఘటనపై టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏఐసీసీ సభ్యురాలు కోట నీలిమ నాయకత్వంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆలయ ప్రాంగణంలో ధర్నా నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు.దేవాలయానికి సంబంధించిన ఏ సమస్య వచ్చినా, భక్తులకు ఇబ్బందులు ఎదురైనా, ఆలయ పరిపాలనలో నిర్లక్ష్యం, అవకతవకలు లేదా లోపాలు కనిపించినా వాటిపై నిరంతరం ప్రశ్నిస్తూ, పరిష్కారం కోసం పోరాడుతామని దేవులపల్లి రవి కిరణ్ స్పష్టం చేశారు. భక్తులు, స్థానిక ప్రజలు, యువత, సామాజిక సేవా సంస్థలు, ఆలయ శ్రేయోభిలాషులు ముందుకు వచ్చి దేవాలయంలో కనిపించే సమస్యలను ధైర్యంగా తమ దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. భక్తులకు అందుతున్న సౌకర్యాలు, పరిశుభ్రత, భద్రత, ఆలయ నిర్వహణలో లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని కోరారు.

# నియోజకవర్గంలో 51.44 శాతం ఎస్ఐఆర్

- శని, ఆది వారాలలో ప్రత్యేక శిబిరాలు

-నియోజకవర్గం ఎలక్టోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి

**అత్తాపూర్ జూలై24,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలో శని ఆది వారాల లో ఎన్యూమరేషన్ ఫారాలను తీసుకోవడానికి, పూర్తి చేసి తిరిగి ఇవ్వడానికి శని, ఆదివారాలలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు నియోజకవర్గ ఎలక్టోల్ ఆఫీసర్, రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నియోజకవర్గం పరిధిలో 6,35,283 మంది ఓటర్లుండగా ఇప్పటి వరకు 3,26,785 మంది ఓటర్ల నుంచి ఎన్యూమరేషన్ ఫారాలను తీసుకుని (డిజిటలైజెడ్) ఆన్ లైన్ చేయడం జరిగిందన్నారు. అంటే నియోజకవర్గం లో 51.44 శాతం పూర్తయిందన్నారు. ఇంకా 2,78,670 మంది ఓటర్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ఫారాలు రావాల్సి ఉన్నాయన్నారు. 29,828 మంది ఓటర్ల అడ్రస్ లు తెలియడం లేదన్నారు.

**ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోండి :** శని, ఆదివారాలలో అన్ని బస్తీలలో ఉన్న పోలింగ్ బూత్ ల వద్ద, బస్తీ ప్రధాన కూడళ్ల వద్ద, కాలనీలలో, కమ్యూనిటీ హాల్ లలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాలలో బీ ఎల్ ఓ లు, వివిధ విభాగాల సిబ్బంది అందుబాటులో ఉండి ఎన్యూమరేషన్ ఫారాలను తీసుకుంటారన్నారు. ఈ రెండు రోజులలో ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి ఇవ్వాలన్నారు. ఆలస్యం చేస్తే ఓటు పోయే ప్రమాదం ఉందన్నారు.

**ఆగస్టు 3 తర్వాత అడ్రస్ ప్రూఫ్ లాంటి పత్రాలను సమర్పించాలి :** ఆగస్టు 3 లోగా ఎన్యూమరేషన్ ఫారాలను ఇచ్చినట్లయితే సులభంగా ఓటరు జాబితాలో పేరు నమోదు అవుతుందని నియోజకవర్గం ఎలక్ట్రోల్ ఆఫీసర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆ తర్వాత పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలంటే అడ్రస్ ప్రూఫ్, వయస్సు ధృవీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. అందుకే సులభంగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడానికి త్వరగా తమ ఎన్యూమరేషన్ ఫారాలను తీసుకుని పూర్తి చేసి ఇవ్వాలని సోలిపేట శ్రీనివాస్ రెడ్డి కోరారు.

## కుటుంబవ్యవస్థ నిర్మాణంపై అవగాహన అవసరం : కమిషనర్ ఆర్ వి కర్ణన్



ఓయాసిస్ ఫెర్టిలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సును ప్రారంభించిన గ్రేటర్ కమిషనర్ కర్ణన్ తదితరులు

**శేరిలింగంపల్లి,జూలై 24 ప్రభాతవార్త**

సంతానోత్పత్తి, ఆరోగ్యం, ముందస్తు అవగాహన సమాచారంతో కూడిన కుటుంబ నిర్మాణంపై ప్రజలకు అవగాహన కలగాల్సిన అవసరం ఉందని గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ అన్నారు. నగరంలోని ఓయాసిస్ ఫెర్టిలిటి జననీ డైలాగ్స్ తొలి ఎడిషన్‌ను నిర్వహించింది.ది పేరెంట్ హుడ్ పారడాక్స్ బిల్డింగ్ ఏ ఫ్యామిలి- ఫ్రెండ్లీ ఇండియా అనే అంశంతో నిర్వహించిన వేదికలో ప్రజారోగ్యం,ప్రభుత్వ వ్యవస్థ, సైకాలజీ,శిశు సంక్షేమం, కార్పొరేట్ మానవ వనరుల నిర్వాహణ, సంతానోత్పత్తి వైద్యం వంటి రంగాలకు చెందిన నిపుణులు హాజరయ్యారు. కుటుంబాలకు అనుకూలమైన భారతదేశాన్ని నిర్మించాలంటే ఏమి చేయాలనే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్ వి కర్ణన్ కార్యక్రమాన్ని ప్రారంభించగా, ఓయాసిస్ ఫెర్టిలిటి సైంటిఫిక్ హెడ్ డాక్టర్ కృష్ణచైతన్య మంత్రవాది మోడరేటర్‌గా వ్యవహరించారు. మారుతున్న జీవన ఆకాంక్షలకు,మారకుండా ఉన్న జీవన సంబంధ వాస్తవాలకు మధ్య పెరుగుతున్న అంతరం ఈ చర్చవేదికపై ప్రధాన ఇతివృత్తంగా నిలిచింది. ఈ సదస్సులో ఓయాసిస్ పెర్టిలిటి సహ వ్యవస్థాపకురాలు,మెడికల్ డైరెక్టర్ డాక్టర్ దుర్గాజిరావు మాట్లాడుతూ.. భారతదేశంలో కుటుంబ నిర్మాణం కోసం ప్రణాళిక చేసుకోవడం క్రమంగా కష్టతరం అవుతోందన్నారు. దీనికి ప్రజల్లో కుటుంబాన్ని ఏర్పాటు చేసుకోవాలనే ఆశక్తి తగ్గిపోవడం కారణం కాదని, సంతానోత్పత్తికి సంబందించిన కాలపరిమితి, పిల్లల పెంపకానికి అయ్యే అర్థిక వ్యయం ఆధునిక ఉద్యోగ జీవితంలోని ఒత్తిళ్లు ప్రభావం చూపుతున్నాయన్నారు. చర్చా కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా,బాలల సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారిణి సుమలత,సైకాలజిస్ట్ డాక్టర్ కౌసర్ షేక్,డాక్టర్ మమతా రఘువీర్,ఉపాసన అనేజా,ప్రొఫెసర్ రాజన్ శుక్లా తదితరులు తమ అభిప్రాయాలను వివరించారు.

## దివ్యాంగ చిన్నారుల వందేమాతరం అద్భుత కూచిపూడి నృత్యనివ్యాసం



దివ్యాంగ చిన్నారుల వందేమాతరం కూచిపూడి నృత్యరూపకంలో దృశ్యం

**రవీంద్రభారతి, జూలై 24 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో దేవ్నార్ ఫౌండేషన్ ఫర్ ది బ్లైండ్, సుమన్ ఆటిజం సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో వికలాంగత చిన్నారులతో అక్షర వందేమాతరం కూచిపూడి నృత్యవిన్యాసం ఆహుతులను మంత్రముగ్ధులను చేసింది. 15 ఏళ్ల యువ కూచిపూడి నర్తకి అక్షర దేవళ్ల భారత జాతీయగేయం వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దృష్టి, వినికిడి, మాటలలోపం, ఆటిజం, మేధో వికలాంగత ఉన్న చిన్నారి విద్యార్థులతో కూచిపూడి రీతిలో వందేమాతరం ఆరు చరణాలను నృత్యరూపక ప్రదర్శన కావించడం విశేషం. ఈ కార్యక్రమానికి భాషా సాంస్కృతి కశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పద్మశ్రీ డా. ఎ.సాయిబాబా గౌడ్, సిఎస్‌బి ఐఎఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత మల్లవరపు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత వి.జానకి, మహేష్‌నాయక్, డా. సుమన్, స్వప్న తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనం చేసి ముందుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్న వయసులోనే కళలను సామాజిక శ్రేయస్సుతో మేళవిస్తూ ప్రత్యేక అవసరాలున్న పిల్లల్లో ఆత్మవిశ్వాసం ప్రోదికొల్పుతూ దేశభక్తిని చాటుతున్న అక్షర దేవళ్ల ప్రయత్నం సమాజానికి స్ఫూర్తిదాయమని నరసింహారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా వెంకట్ రాపోలు విద్యార్థులకు ఛాయాచిత్రాలను కానుకగా అందజేశారు. సభకుముందు వివిధ ఆటిజం పాఠశాలలకు చెందిన సుమారు 150మంది విద్యార్థులు తమ సాంస్కృతిక ప్రదర్శనలతో హోరెత్తించారు.

## మహిళాసభ కర్ణాటక గాత్ర సంగీత వీణ పోటీలకు ఆహ్వానం

**నాంపల్లి, జూలై 24 ప్రభాతవార్త :** దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ (ఆంధ్ర మహిళా సభ) కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్, ఓయు క్యాంపస్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో కర్ణాటక గాత్రసంగీతం, వీణ పోటీలు నిర్వహించబడుతున్నాయని అన్ని సంగీత విద్యార్థులకు తెలియజేస్తున్నారు. ఈ పోటీలు 8 ఆగస్టు 2026 శనివారం సీనియర్స్, సూపర్ సీనియర్స్ మరియు వీణ విభాగం; 9 ఆగస్టు 2026 ఆదివారం సబ్ జూనియర్స్ మరియు జూనియర్స్ విభాగంలో డీడీఎంఎస్ (ఏఎంఎస్) కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్, ఓయు క్యాంపస్, హైదరాబాద్‌లో నిర్వహించబడతాయి. పూర్తి వివరాలకు 9441768811/8125498263లలో సంప్రదించవచ్చునని, దరఖాస్తులు సమర్పణకు చివరితేదీ 2 ఆగస్టు 2026. ఆసక్తిగల విద్యార్థులు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకుని, నిర్ణీత గడువులోపు దరఖాస్తులను సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

### మహిళా భవన్ పనుల అడ్డగింత, దాడి.. కేసు నమోదు

**జూబ్లీహిల్స్, జూలై 24, ప్రభాతవార్త:** మహిళా భవన్ నిర్మాణ పనులకు అడ్డుపడి దాడికి పాల్పడిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. గౌరిశంకర్‌కాల నీలో మహిళా భవన్ నిర్మాణం కోసం గురువారం భూమిపూ జకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ కార్మికు లు స్థలాన్ని శుభ్రం చేస్తున్న సమయంలో స్థానికుడైన అభిషేక్ అక్కడికి చేరుకొని పనులను అడ్డగించడమే కాకుండా అక్కడే ఉన్న భీంరావుతోపాటు పలువురు మహిళలపై దాడికి పాల్పడ్డా డు. భీంరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీనగర్‌కాలనీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో వరుణయాగం



వరుణయాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే నవీన్‌యాదవ్

**జూబ్లీహిల్స్, జూలై 24, ప్రభాతవార్త:** సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు, దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ సూచనల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వరుణ యాగాల్లో భాగంగా శుక్రవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వరుణయాగం, సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. ఇందు కోసం ఇక్కడ ప్రత్యేకమైన ఏర్పాట్లు చేశారు. నందీశ్వరుడి వద్ద వరుణయాగానికి సంబంధించిన ప్రత్యేకమైన రంగవల్లిని తీర్చిదిద్దడంతోపాటు ఆలయంలో నీటి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాగంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, సహాయ కమిషనర్ కృష్ణ, ఆలయ ఈఓ శ్రీనివాసవర్మ, ఆలయ మాజీ కమిటీ ఛైర్మన్ సిపిరి అర్జున్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచనము, రక్షాబంధనము, అఖండ దీపారాధన, ఋత్విక్ వరుణము, మండపారాధన, వరుణ జపం, అరుణ మండల ఆరాధన, ఋష్యశృంగపూజ, రుద్రాభిషేకం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ మాజీ కమిటీ సభ్యులు దినేష్, రాజేష్, జగదీష్, సుదర్శన్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు సామాగ్రిని అందజేసిన కొమిరిశెట్టి సాయిబాబా

### -గచ్చిబౌలి డివిజన్‌లో గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమం



అంగన్‌వాడీ సెంటర్ల నిర్వాహకులకు సామాగ్రిని అందజేస్తున్న సాయిబాబా

**గచ్చిబౌలి, జూలై 24 ప్రభాతవార్త**

గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని 12 అంగన్‌వాడీ కేంద్రాలకు శేరిలింగంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా వంట సామాగ్రి, వస్తువులను అందజేశారు. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని కేటీఆర్ ప్రారంభించిన గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా కొమిరిశెట్టి సాయిబాబా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం ఖాజాగూడ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సెంటర్ల నిర్వాహకులకు సామాగ్రిని అందించారు. అనంతరం సాయిబాబా మాట్లాడుతూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా 12 అంగన్‌వాడీ కేంద్రాలకు వంట సామాగ్రి, ఇతర వస్తువులను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. తన జన్మదిన వేడుకలకు దూరంగా ఉండాలని, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కేటీర్ పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. వంట సామాగ్రి కొరతతో అంగన్‌వాడీ కేంద్రాలు ఇబ్బందులు పడుతున్నాయని తన దృష్టికి వచ్చిందని, విద్యార్థులు, నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేందుకు కేటీర్ జన్మదినాన్ని వేదికగా చేసుకొని సామాగ్రిని అందజేసినట్లు తెలిపారు. శేరిలింగంపల్లిలోని విద్యార్థులకు ఏ అవసరం ఉన్నా తనవంతు సహకారం అందించేదుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అంగన్‌వాడీ సెంటర్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జి ప్రజాస్వామ్యానికి విరుద్ధం: క్రైస్తవ సంఘాలు



క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సభలో పాల్గొన్న తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొనె సల్మాన్ రాజ్

**చిక్కడపల్లి జులై 24 ,ప్రభాతవార్త :** ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై బలప్రయోగం, లాఠీచార్జి, టియర్ గ్యాస్ ప్రయోగించడాన్ని తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ , ఓ ఓ సిసి, టి యు సి ఎస్ , బిసిసితో పాటు ఇతర క్రైస్తవ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. శుక్రవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లో తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొనె సల్మాన్ రాజ్ ముఖ్య అతిధిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించి ప్రసంగించారు. శాంతియుత సమావేశాలపై అణచివేత చర్యలు భారత ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. తెలంగాణలోని అనుబంధ క్రైస్తవ సంస్థలతో కలిసి విద్యార్థుల ఉద్యమానికి తమ సంఘీభావం ప్రకటించారు. ప్రజాస్వామ్య హక్కులను వినియోగించుకుంటున్న విద్యార్థులపై మితిమీరిన బలప్రయోగం, లాఠీచార్జి, టియర్ గ్యాస్ వినియోగం ఆందోళనకరమని, ఇటువంటి చర్యలు దేశ రాజ్యాంగ విలువలను బలహీనపరుస్తాయని తెలిపారు. న్యాయం, పారదర్శకత, జవాబుదారీతనం కోసం ఉద్యమిస్తున్న విద్యార్థులకు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. దేశ రాజధానిలో శాంతియుత నిరసనలను అణచివేసే చర్యలు, ఇంటర్నెట్ సేవల నిలిపివేత, బలవంతపు నియంత్రణ వంటి చర్యలను వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఈ పరిణామాలపై నైతిక బాధ్యత వహిస్తూ సంబంధిత కేంద్ర మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బెనోని రిచర్డ్, ఎం.ఏ. వందనం, జయకుమార్, ఈ. నవీన్, ఎం. షాలిని, బెటినా, క్రిస్టియానా, మెరీనా తదితరులు పాల్గొన్నారు.

## వివాదాస్పద స్థలంలో ఇచ్చిన నిర్మాణ అనుమతిని రద్దు చేయాలి : మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



ధర్నాలో మైనంపల్లి హనుమంతరావు

**అల్వాల్, జూలై 24 ప్రభాతవార్త:** వివాదస్పద స్థలంలో ఇంటి నిర్మాణానికి ఇచ్చిన అనుమతిని వెంటనే రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు డిమాండ్ చేశారు. ఓల్డ్ అల్వాల్ భీమ్‌రావు కాలనీకి చెందిన లే అవుట్‌లో పార్కుగా చూపించిన స్థలంలో ఇంటి నిర్మాణానికి అనుమతి ఇవ్వడంతో వివాదం రాజుకుంది. కాలనీ వాసులుతో కలిసి కాంగ్రెస్ శ్రేణులు ఇంటి నిర్మాణ అనుమతిని తక్షణం రద్దు చేయాలని ఆందోళన బాట పట్టారు. శుక్రవారం స్వయంగా మైనంపల్లి కాలనీ వాసులుతో కలిసి ధర్నాకు దిగారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న రోజులు నుంచి సంబంధిత స్థల వివాదం తెలుసు అని పేర్కొన్నారు. పార్కుకు కేటాయించిన స్థలంలో నిర్మాణ అనుమతి పొందడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుసుకుని అప్పట్లోనే అడ్డుకున్నానని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణానికి అనుమతి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. జిహెచ్ఎంసి అధికారులు దీనిపై తక్షణం విచారణ జరిపి సంబంధిత అధికారులుపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాలనీ వాసులకు తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులుతో పాటుగా మాజీ కార్పొరేటర్ జితేందర్‌నాథ్ కాంగ్రెస్ నేతలు లక్ష్మీకాంత్ రెడ్డి, దేవేందర్, సూర్యకిరణ్, సురేందర్ రెడ్డి, రాజసింహారెడ్డి, నాగేశ్వరరావు, వీనస్ మేరీ, జ్యోతి యాదవ్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## పాతబస్తీలో కాంగ్రెస్ నాయకుల నిరసన




గౌలిపుర గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న యాకుత్‌పుర కాంగ్రెస్ నాయకులు

**చార్మినార్,జూలై 24 ప్రభాతవార్త :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన లాఠీ చార్జీ,ప్రతి పక్ష నేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ యాకుత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు శుక్రవారం గౌలిపురలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని,నీట్ పేపర్ లీకు దోషులను కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి మామిడి కృష్ణ,యాకుత్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ కె.రవి రాజ్,డిసిసి ఉపాధ్యక్షులు శ్రీ కాంత్,మాజీ ఉపాధ్యక్షులు రాజు యాదవ్,యాకుత్‌పుర నియోజకవర్గం ఎ బ్లాకు అధ్యక్షులు మామిడాల శ్రీనివాస్ ,డిసిసి ప్రధాన కార్యదర్శులు శశియాదవ్,నళినీ గౌడ్,డిసిసి కార్యదర్శులు దల్లు శివ,కిరణ్,టిపిసిసి ప్రోటో కాల్ కార్యదర్శి అల్లం రాకేష్,,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మోహన్ రెడ్డి, కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## కొత్త రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి



జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ మంగతాయారుకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న గాంధీనగర్ మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

**చిక్కడపల్లి జులై 24,ప్రభాతవార్త :** గాంధీనగర్ డివిజన్‌లో కొత్త రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని స్థానిక మాజీ కార్పొరేటర్ ఎ. పావని వినయ్‌కుమార్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ మంగతాయారును కోరారు. ఈ మేరకు శుక్రవారం జోనల్ కమీషనర్ ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రతిపాదించిన రోడ్ల నిర్మాణ పనుల పురోగతిపై వివరాలు తెలియజేయాలని కోరారు. ఆయా బస్తీలు, కాలనీల్లో కొత్త రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్లు దెబ్బతిన్నాయని, ముఖ్యంగా అమ్మవారి దేవాలయాల పరిసరాల్లో కనీసం తాత్కాలిక మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన జోనల్ కమిషనర్ మంగతాయారు రానున్న బోనాల పండుగను దృష్టిలో ఉంచుకుని అమ్మవారి దేవాలయాల వద్ద దెబ్బతిన్న రోడ్లకు ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టేందుకు అనుమతులు లభించాయని తెలిపారు. షార్ట్ టెండర్లు పిలిచి పండుగకు ముందే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చినట్లు మాజీ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

## పోలీసునని నమ్మించి సెల్‌ఫోన్ చోరీ

**జూబ్లీహిల్స్, జూలై 24, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌పై పోలీసునని చెప్పి ఓ యువకుడిని వాహనాన్ని అడ్డగించి, బెదిరించి, అతని మొబైల్ ఫోన్‌ను అపహరించిన సంఘటన ఖైరతాబాద్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పోలీసుల కథనం ప్రకారం.. బాగ్‌లింగంపల్లికి చెందిన జీహెచ్‌ఎంసీ డ్రైవర్ బోయ సాయి సునీల్(21) జీహెచ్‌ఎంసీలో చెత్త సేకరణ వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 22న రాత్రి బాల్కంపేటలోని తన బాబాయి ఇంటికి వెళ్లిన సునీల్, అక్కడి నుంచి తన బాబాయి కుమారుడు రాజశేఖర్‌తో కలిసి టీఎస్ 09 ఎఫ్‌జెడ్ 8656 నంబర్ గల యాక్టివా ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు.23వ తేదీ తెల్లవారుజామున సుమారు 12.30 గంటల సమయంలో ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌పై వెళ్తుండగా, ఓ గుర్తు తెలియని వ్యక్తి వారి బైకును అడ్డగించాడు. తాను పోలీసునని చెప్పి వేగంగా వాహనం నడుపుతున్నావంటూ ప్రశ్నిస్తూ వాగ్వాదానికి దిగాడు. క్షమాపణ చెప్పినా వినకుండా మద్యం సేవించి వాహనం నడుపుతున్నావంటూ ఆరోపించాడు. పోలీసునంటూ చెప్పిన వ్యక్తే మద్యం మత్తులో ఉన్నట్లు కనిపించడంతో పాటు మొబైల్ ఫోన్‌తో వీడియో చిత్రీకరిస్తున్నట్లు గుర్తించారు. పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుకుందాం అంటూ ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుటికి తీసుకెళ్లాడు. అక్కడ సునీల్ చేతిలో ఉన్న మొబైల్ ఫోన్‌ను లాక్కొని, వాహనం పార్క్ చేసి వస్తాను, నువ్వు స్టేషన్‌లోకి వెళ్లి ఉండు అంటూ అక్కడి నుంచి జారుకున్నాడు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లోకి ఎంతసేపు వేచి చూసినా అతడు రాకపోవడంతో బయటకు వచ్చి చూడగా, మొబైల్ ఫోన్‌తో పాటు తన ద్విచక్ర వాహనంపై పరారైనట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఖైరతాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జేహెచ్ఐసీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలి : సురేందర్ రెడ్డి

**జూబ్లీహిల్స్, జూలై 24, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్(జేహెచ్ఐసీ) వ్యవహారాల్లో తక్షణమే జోక్యం చేసుకుని సంస్థను చట్టబద్ధంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ (జేహెచ్‌సీహెచ్‌బీఎస్)కి జేహెచ్ఐసీ మాజీ అధ్యక్షుడు కె. సురేందర్ రెడ్డి లేఖ రాశారు. తెలంగాణ సొసైటీస్ రిజిస్ట్రేషన్ చట్టం-2001 ప్రకారం తమకు ఉన్న అధికారాలను వినియోగించి జేహెచ్ఐసీ రికార్డులను భద్రపరచడం, బ్యాంకు ఖాతాలను స్తంభింప చేయడం, పరిపాలనాధికారి లేదా పర్సన్ ఇన్‌చార్జ్‌ను నియమించడం, ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించడం, అవసరమైన చట్టపరమైన చర్యలు ప్రారంభించాలని ఆయన లేఖలో కోరారు. జిల్లా రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీస్‌కు దాఖలు చేసిన ఆర్టీఐ ద్వారా పాలకమండలి ఏర్పాటులో నకిలీ పత్రాలు, ఫోర్జరీ సంతకాలు ఇతర అంశాలు వెలుగు చూశాయని, దీనికితోడు జేహెచ్ఐసీ పాలకమండలిపై ఎఫ్ఐఆర్ నమోదైన అంశాన్ని అందులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న గవర్నింగ్ కౌన్సిల్‌కు చట్టబద్ధత లేదని, నకిలీ పత్రాల వ్యవహారం, నమోదైన కేసుల నేపథ్యంలో ప్రస్తుత కమిటీ కొనసాగడం సంస్థ ఆస్తులు, ఆర్థిక వ్యవహారాలు, సభ్యుల ప్రయోజనాలకు ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. జూన్ 28న నిర్వహించిన వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం/ఈజీఎం) మినిట్స్‌ను జూలై 26న ధ్రువీకరించే ప్రయత్నం జరుగుతోందని, పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు, విధానపరమైన లోపాల నేపథ్యంలో అలాంటి చర్యలు చట్టవిరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఆయా సమావేశాన్ని నిర్వహించే లోపే తగిన చర్యలు తీసుకోవాలని అందులో కోరారు. జేహెచ్‌సీహెచ్‌బీఎస్ సంస్థ జేహెచ్ఐసీకి మాతృసంస్థ కావడంతో,తక్షణమే పాలక మండలి బాధ్యతలను స్వీకరించి సంస్థ ఆస్తులు,ఆర్థిక రికార్డులను రక్షిస్తూ రోజువారీ పరిపాలనను పారదర్శకంగా నిర్వహించాలని సురేందర్ రెడ్డి తన లేఖలో కోరారు.

## ఏకలవ్యుని జయంతి అధికారికంగా నిర్వహించాలి

**రాష్ట్ర ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షులు తిరుపతి**


ఏకలవ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలంగాణ ఎరుకల ప్రజా సమితి నేతలు

**ముషీరాబాద్, జులై 24, ప్రభాతవార్త:** ఏకలవ్యుని జయంతిని అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ ఎరుకల ప్రజా సమితి రాష్ట్ర అధ్యక్షులు కెమసారం తిరుపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏకలవ్య జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో టీవైపీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ గురు భక్తిని చాటి చెప్పిన ఏకలవ్య విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. ఎరుకలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటుచేయాలని, కార్పోరేషన్‌కు ప్రతి సంవత్సరం ఐదు నుంచి పది కోట్ల రూపాయలు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో ఒక ఏకలవ్య గురుకుల పాఠశాల ఏర్పాటుచేయాలని, పర్యావరణ రక్షణలో భాగంగా తెల్ల పందుల పెంపకంపై ఎరుకుల కులస్థులకు శిక్షణ ఇచ్చి, ఋణాలు ఇప్పించాలని కోరారు. ఈ సమావేశంలో టీవైపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుతాడి అశోక్, తిరుపతి సంపత్, సహాయ కార్యదర్శులు నడిగడ్డ కుమారస్వామి, రేవెల్లి ఓదెలు, ఉండ్రాల ఎల్లయ్య, కెమసారం నగేష్, కెమసారం నాగేశ్వర్, మానుపాటి జయశంకర్, కోనేటి పోచవ్వ, మల్లపూర్తి సాయిలు, ఎరుకలి బసప్ప, మహిళా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుతాడి కోమల, ఉపాధ్యక్షులు కుర్ర రజిత, కోనేటి రమాదేవి, దాసరి విజయ, రేవెల్లి శారద, కట్ట జ్యోతి, ఉండాడి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు మంచి జీవితం అందించటమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న గంజి జగన్‌బాబు

**ముషీరాబాద్, జులై 24, ప్రభాతవార్త:** మారుతున్న కాలానికి అనుగుణంగా, వృద్ధులను అక్కున చేర్చుకుని, వారికి మంచి జీవితం అందించటమే లక్ష్యంగా వృద్ధాశ్రమ నిర్మాణం జరుగుతోందని ఆనంద నిలయం వ్యవస్థాపకులు, చీఫ్ ప్రమోటర్ గంజి జగన్‌బాబు వెల్లడించారు. శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన వ్యవస్థాపక సభ్యులు అశోక్ కంటేతో కలిసి మాట్లాడుతూ మహారాష్ట్ర లోని రాయగడ్ జిల్లా సుధాగర్ మండలం, తడ్గవ్ గ్రామంలో 30 కోట్ల రూపాయలతో 73వేల చదరపు అడుగులతో, 200 మంది వృద్ధుల సౌకర్యార్థం, అన్ని హంగులతో వృద్ధాశ్రమం నిర్మించటానికి, ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులతో పాటు వ్యవసాయేతర నోటిఫికేషన్ కూడా పూర్తి చేసుకోవటం జరిగిందని తెలిపారు. అనుభవజ్ఞులైన నిపుణుల సలహాలు, సూచనలతో, దాతల విరాళాల ద్వారానే పనులు చేపడుతున్నామని, విరాళాలకు 80జి పన్నుల మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈ వృద్ధాశ్రమంలో వృద్ధుల కోసం మెరుగైన వసతులు, ఆసుపత్రి, ఆధ్యాత్మిక కేంద్రం, ఆధునాతన లైబ్రరీ, వ్యాయామశాల కల్పిస్తున్నామని, మహారాష్ట్రలో స్థిరపడిన తెలుగు పారిశ్రామిక వేత్తలు ఈ ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని కోరారు. పూర్తి వివరాలకు మా వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

## విఠలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


బ్రహ్మోత్స వాలకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను ఆహ్వాన పత్రికను అందచేస్తున్న విఠలేశ్వరస్వామి ఆలయ చైర్మన్ మాజీ కార్పొరేటర్ గొంటిశంకర్‌యాదవ్, అధ్యక్షులు పుష్కిల కిషన్‌యాదవ్‌లు

**బేగంబజార్, జులై 24ప్రభాతవార్త:** ప్రతియేటా ఆషాడ మాసం ఉస్మానషాహిలోని విఠలేశ్వర జంగల్ విఠోబా దేవాలయంలో నిర్వహించే విఠలేశ్వర రథోత్స వ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించేందుకుగాను పూర్తి ఏర్పాట్లు చేశారు. ఈనెల 24వ తేదిన సాయంత్రం ఆరు గంటలకు ఆలయం నుంచి స్వామిరథోత్స వం ప్రారంభమవుతుందన్నారు. ఈ ఉత్స వాలకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్యఅతిథిగా విచ్చేసి రథోత్స వాన్ని ప్రారంభించేందుకుగాను ఆహ్వాన పత్రికను అందచేయడం జరిగిందని ఆలయ కమిటి చైర్మన్ గొంటిశంకర్‌యాదవ్, అధ్యక్షులు పుష్కిల కిషన్‌యాదవ్‌లు తెలిపారు. విఠలేశ్వరస్వామిని దర్శనం కోసం నగర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున్న భక్తులు తరలిరావడం జరుగుతుందన్నారు. తొలిఏకాదశి పూజలు కూడా ఘనంగా జరగనున్నట్లు తెలిపారు.

# పేద విద్యార్థుల భవిష్యత్తుకు అండగా ఉంటా : టీ.ఎన్


రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.

**కంటోన్మెంట్, జులై 24 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెందేందుకు ఎల్లప్పుడు తమ సహాయ సహకారాలు ఉంటాయని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ తెలిపారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం రైల్ నిలయం అంబేద్కర్ నగర్, అన్నా నగర్, రసూల్‌పుర, గన్ బజార్, బోయిన్‌పల్లి ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఉచితంగా నోట పుస్తకాలను పంపిణీ చేశారు. స్టడీ మెటీరియల్ నోట్ బుక్‌ల కవర్‌పై కేటీఆర్ ఫొటోను ఏర్పాటు చేయడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు దేవులపల్లి శ్రీను, శ్యామ్ రెడ్డి, చంద్రకాంత్, నారాయణ, రాము, సిద్దు, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

**జెబిఎస్ వద్ద పేదలకు అన్నదానం చేసిన నివేదిత. . .**

కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని కంటోన్మెంట్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే నివేదిత సాయన్న ఆధ్వర్యంలో శుక్రవారం జెబిఎస్ వద్ద పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, బిఆర్ఎస్ నేతలు గజ్జెల గోపాల్, మురళీ యాదవ్, దేవులపల్లి శ్రీను, కె.బి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ నియోజకవర్గంలో 480 ఇందిరమ్మ ఇళ్లు : ఎమ్మెల్యే శ్రీగణేష్


ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం బోయిన్‌పల్లిలో స్థలాలను పరిశీలిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్

**కంటోన్మెంట్, జులై 24 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గంలో నివాసం ఉంటున్న ఇండ్లులేని నిరుపేదలకు బోయిన్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించేందుకు ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేస్తున్నామని నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శుక్రవారం మారేడ్‌పల్లి మండలంలోని మహేంద్రహిల్స్, తిరుమలగిరి మండలంలోని బోయిన్‌పల్లి ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వస్థలాలను ఎంపిక చేసేందుకు తహశీల్దార్‌లు బిక్షపతి, అసదుల్లాఖాన్, హౌజింగ్ అధికారులు గ్రీష్మలను వెంటపెట్టుకొని ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా సమగ్ర ప్రణాళికతో పేదల కోసం ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని ప్రణాళిక సిద్దం చేశామన్నారు. నగరంలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కొక్క నియోజకవర్గం నుంచి 480 ఇండ్లను నిర్మించేందుకు తొలి దశలో నిర్మాణం పనులు చేపట్టేందుకు శ్రీకారం చుదుతున్నామన్నారు. సొంత ఇండ్లులేని నిరుపేదలకు రూ.10 వేల డిపాజిట్ చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. లబ్ధిదారుడి వాటా కిందా రూ. 6 లక్షల రూపాయలను దశాల వారిగా చెల్లించాలన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన అర్హులైన ఇండ్లులేని నిరుపేదలకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ ఆనంద్ బాబు, సీనియర్ కాంగ్రెస్ నేతలు సంకి రవిందర్, నాగినేని సరిత, మురళీ ముదిరాజ్, మారుతీ గౌడ్, బల్వంత్ రెడ్డి, మార్కెట్ సభ్యులు క్రిష్ణారెడ్డి, శరత్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గౌరీ నీలకంఠేశ్వర ఆలయంలో విశేష అభిషేకాలు...

**కెపిహెచ్‌బి కాలనీ, జులై 24, ప్రభాతవార్త**


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కూకట్‌పల్లి నియోజకవర్గ బ్రాహ్మణ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఆషాడ శుక్ల దశమి సందర్భంగా శుక్రవారం ఉదయం ఏడు గంటల నుండి కెపిహెచ్‌బి కాలనీ ఏడవ ఫేస్‌లో గల శ్రీ గౌరీ నీలకంఠేశ్వర ఆలయంలో విశేష అభిషేకములు జరిగాయి. ప్రస్తుతం మనదేశంలో నెలకొన్న అనావృష్టి ప్రాబల్యం చేత వర్షములు తక్కువగా ఉండి జలాశయాలలో కూడా నీరు తక్కువగా ఉండడం చేత అంతట కరువు పరిస్థితులు నెలకొని సాగునీరు, తాగునీరుకు కూడా ఇబ్బందికరంగా ఉండడం చేత ఈ అనావృష్టి బాధలు కరువు తొలగిపోయి సకాలంలో వర్షములు కురవాలని సస్యాశామలమైన పరిస్థితులు నెలకొనడానికి సుభిక్షమైన క్షేమారోగ్యములు సమస్త లోక కళ్యాణం కలగాలనే సంకల్పంతో కెపిహెచ్‌బి కాలనీ ఏడవ ఫేస్‌లో నెలకొన్న శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో ఆ పరమేశ్వరుని అనుగ్రహానికై శతఘటాభిషేకము, వర్ష పాశుపత అభిషేకము, గౌరీ దేవికి శాకంబరీ అలంకారము, లలితా సహస్రనామ పారాయణము తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తూండ్ల కమలాకర శర్మ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, 9 కాండూరి నరేందర్ ఆచార్య, అధ్యక్షులు సుబ్బా రావు, ప్రధాన కార్యదర్శి పంచగండేశ్వర శర్మ, పుండరీకాక్ష శర్మ, గోపాల రత్నం, శ్రీపాద రావు, శేషగిరి, ఎన్. మూర్తి, అనిత, శైలజ, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

## సర్ సర్వేలో ఓటు నమోదు చేసుకోండి



**కెపిహెచ్‌బి కాలనీ, జులై 24, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని కూకట్‌పల్లి డివిజన్‌లోని శాంతినగర్, పార్కులో బూతు నంబర్లు 8,9,10,11 లలో బూతు ఇంచార్జిలు శుక్రవారం ఓటర్ సమగ్ర సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, రామాలయం కమిటీ మాజీ చైర్మన్ ఎన్. శ్రీనివాసరావు (తులసిరావు) డివిజన్‌లో జరుగుతున్న ఓటర్ల సమగ్ర సర్వేను శుక్రవారం పరిశీలించారు. అనంతరం బిఎల్ఓ, బిఎల్ఏలతో కలిసి కోటరు సర్వేకు సంబంధించిన పత్రాలను స్థానికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జి. ప్రశాంతరావు, మర్యాద అశోక్, ఏ సంతోష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వివేకానందనగర్ డివిజన్‌లో కాంగ్రెస్ నిరసన..


నిరసన తెలుపుతున్న దృశ్యం

**కెపిహెచ్‌బి కాలనీ, జులై 24, ప్రభాతవార్త**

నీట్ పేపర్ లీక్ వ్యవహారాన్ని నిరసిస్తూ కూకట్‌పల్లి వివేకానంద నగర్ కమాన్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులకు న్యాయం చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జోక్యం చేసుకుని నిరసనకారులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆ ప్రాంతంలో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## విద్యార్థులకి బ్యాగులు, ప్లేట్లు పంపిణీ

**కెపిహెచ్‌బి కాలనీ, జులై 24, ప్రభాతవార్త**

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు కేటీఆర్ 50వ జన్మదినం సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా వివేకానంద నగర్ డివిజన్‌లోని బాగ్ అమీర్లో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకి బ్యాగులు, ప్లేట్లు, ఆట వస్తువులను మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, సీనియర్ నాయకులు గొట్టుముకుల పెద్ద భాస్కరరావు, మాచర్ల భద్రయ్య, తీగల కృష్ణారావు, విజయలక్ష్మి, సంజీవరావు, జగదీష్ గౌడ్, యాదయ్య, సతీష్ , రవీంద్రరావు, మురళి, కిరణ్, బాబు, అనిల్, ప్రవీణ్, నవీన్, మల్లేష్, సంతోష్, శ్రీరామ్, శ్రీనివాస్, నరహరి, సంపత్, హరీష్, నరేష్, శ్రీధర్ రావు, అఖిల్, శ్రీనివాస్, జైకుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కేశవగిరిలో దేవశయన ఏకాదశి

**చాంద్రాయణగుట్ట, జులై 24, ప్రభాతవార్త :** ఆషాఢ శుద్ధ ఏకాదశి (తొలి ఏకాదశి, దేవశయన ఏకాదశి, ఆషాఢి ఏకాదశి)ని పురస్కరించుకొని ఈనెల 25వ తేదీ శనివారం చారిత్రక ప్రసిద్ధిగాంచిన చాంద్రాయణ గుట్ట కేశవగిరిపై వెలసిన స్వయం భుః శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానంలో విశేష పూజా కార్యక్ర మాలు నిర్వహించనున్నారు. ఇందు కోసం ఆలయ ప్రధాన అర్చకులు కంజర్ల ప్రతాపాచార్యులు, నిర్వాహకుల ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. తెల్లవారు జామున 5.30 గంటలకు స్వామివార్లకు అభిషేకం, 7 గంటలకు విశేష అలంకరణ, హారతి, భక్తులకు సర్వదర్శనం, తీర్థప్రసాద వితరణ చేపట్టనున్నారు. అదేవిధంగా పాతనగరంలోని పలు ప్రాంతాలలో గల వైష్ణవాలయాలలో తొలి ఏకాదశిని పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తొలి పండుగకు ఉపవాస దీక్షలు, భక్తిప్రపత్తులతో పూజలు నిర్వహించేందుకు పాతబస్తీ ప్రజలు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తొలి ఏకాదశి రోజున శ్రీ మహావిష్ణువు యోగనిద్ర స్థితిలోకి (దేవశయన) వెళతారు. చాతుర్మాస్య దీక్షలు ప్రారంభమైతాయి.

## కెటిఆర్ ఇంటికి సన్నబియ్యం పంపిన చైర్మన్ సాయికుమార్



సన్నబియ్యాన్ని చూపుతున్న పిసిరేష్ చైర్మన్ మెట్టుసాయికుమార్

**అఫ్జల్‌గంజ్, జులై 24ప్రభాతవార్త:** బిఆర్ఎస్ కార్యానిర్వాహక అధ్యక్షులు కెటిఆర్ జన్మదినం రోజుతెలంగాణ ప్రభుత్వ కానుకగా సన్నబియ్యాన్ని రాపిడోలో పంపినట్లు పిషరీష్ చైర్మన్ మెట్టుసాయికుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సన్న బియ్యం ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. ఒకప్పుడు సన్నబియ్యంతో చేస్తే పండగ అనుకునేదన్నారు .తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పదవి భాద్యతలు చేపట్టిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఇంట్లో పండగజులు అన్నారు. కెటిఆర్ పుట్టిన రోజున నిరుపేత కుటుంబం ఇంటికి వెళ్లి సన్నబియ్యంతో భోజనం చేసినందుకుగాను ధన్యావాదములు తెలిపారు. 25 కేజీల సన్నబియ్యం కెటిఆర్ పుట్టిన రోజున కానుకగా పంపించడం జరిగిందన్నారు. ప్రజా ప్రభుత్వంలో అందరు సన్న బియ్యంతో భోజనం చేస్తున్నట్లు తెలిపారు. సన్న బియ్యం అన్ని పార్టీల వారు ఉన్నవాళునంల లేనివాళ్లు కూడా వండుకొని భోజనం చేయ వచ్చునన్నారు.

## కంటోన్మెంట్ డిపోను తనిఖీ చేసిన ఈడీ శ్రీధర్


కంటోన్మెంట్ డిపోను తనిఖీ చేసిన ఆర్టీసీ ఈడీ శ్రీధర్

**అడ్డగుట్ట, జులై 24 ప్రభాతవార్త:** ఎలక్ట్రిక్ బస్సుల వెహికిల్ కండీషన్‌ను మెరుగుపర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్ తెలిపారు. సికింద్రాబాద్ జూబ్లీ బస్టేషన్‌లోని కంటోన్మెంట్ డిపోలోని ఈవి ఒలక్ట్రా బస్‌లను, ఛార్జింగ్ పాయింట్‌లను ఆయన తనిఖీ చేశారు. వెహికిల్ కండిషన్ సక్రమంగా ఉంటేనే బస్సులను బయటకు పంపించాలని సూచించారు. వెహికిల్ కండిషన్లను ఎప్పటికప్పుడు మెకానిక్‌లు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్.ఎం.సురేష్ చౌహాన్, కంటోన్మెంట్ డిపో మేనేజర్ కె.కవిత, ఎలక్ట్రిక్ బస్‌ల ఇన్‌ఛార్జి వినోష్, జ్ఞానేశ్వర్, ఎం.ఎఫ్.శివరంజన్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీపతిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గౌలిపురా ఆరెకటిక సహకార సంస్థ అధ్యక్షులుగా అంబాదాస్


కొత్తగా ఎన్నికైన కమిటి ప్రతినిధులు

**చాంద్రాయణగుట్ట, జులై 24, ప్రభాతవార్త :** గౌలిపురా ఆరెకటిక థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌కు జరిగిన ఎన్నికల్లో సొసైటీ అధ్యక్షులుగా కె.అంబాదాస్ ఎన్నికైయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం.అర్జున్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎ.బాను ప్రకాష్, సంయుక్త కార్యదర్శిగా జె.సురేందర్ కుమార్, కోశాధికారిగా జె.సరిత, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎన్.మారుతి రావు, కార్యవర్గ సభ్యులుగా యు.యశ్వంత్‌రావు, ఎం.రమేష్, కె.కరుణావతిలు నియమితులైయ్యారు. కొత్త కమిటీ ఐదేళ్ల పదవిలో ఉంటుంది. ఈ మేరకు ఎన్నికల అధికారి ఎ.నాగిరెడ్డి ప్రకటన చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంబాదాస్, బాను ప్రకాష్‌లు మాట్లాడుతూ అరెకటిక సామాజిక వర్గ సహకారంతో వారి సంక్షేమం, అభివృద్ధికి కొత్త కమిటీ కృషి చేస్తుందన్నారు.

## గాజులరామారం విలేజ్‌లో బస్తీల సమస్యలను పరిశీలించిన కూన శ్రీనివాస్ గౌడ్

**జీడిమెట్ల, జులై 24, ప్రభాతవార్త**


స్థానికులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

గాజులరామారం సర్కిల్ పరిధిలోని 278 గాజులరామారం డివిజన్‌లోని గాజులరామారం విలేజ్‌లో పలు బస్తీల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను మేడ్చల్ మల్కాజిగిరి డీసీసీ ఉపాధ్యక్షులు శ్రీ కూన శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం ప్రత్యక్షంగా పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడిన ఆయన, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ప్రధానంగా అంతర్గత సీసీ రోడ్ల లేమి, సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు అవసరం వంటి అంశాలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కూన శ్రీనివాస్ గౌడ్ సంబంధిత అధికారులను సంఘటనా స్థలానికి పిలిపించి, సీసీ రోడ్ల నిర్మాణానికి అవసరమైన కొలతలను చేపట్టేలా ఆదేశించారు. అవసరమైన ప్రతిపాదనలను త్వరలోనే ఉన్నతాధికారులకు పంపించి, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థతో పాటు ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులకు పరిపాలనా అనుమతులు పొందేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని, ప్రతి సమస్యను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కట్టుబడి పనిచేస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుల సహకారంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు అందుతున్నాయని పేర్కొన్నారు. అలాగే, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలో తగిన అభివృద్ధి పనులు చేపట్టలేదని విమర్శిస్తూ, అందువల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు.

## బకాయిల విడుదలకు ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి హామీ


ఎంఎంసీ కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డి కి వినతిపత్రాన్ని అందజేస్తున్న న్యూకాంట్రక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

**తార్నాక, జులై 24 ప్రభాతవార్త :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డితో ఎం ఎం సి నూతన కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధులు సమావేశమై కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన కమిషనర్ పలు అంశాలపై హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు. వచ్చే నెల 5వ తేదీలోపు మున్సిపల్ పనులకు సంబంధించిన బకాయిలతో పాటు ఇతర సాధారణ చెల్లింపుల కింద సుమారు రూ.25 కోట్లను విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక అభివృద్ధి నిధులకు సంబంధించిన బిల్లులు జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి అందిన వెంటనే విడుదల చేస్తామని ఆయన తెలిపినట్లు వివరించారు. అలాగే 2024-25 సంవత్సరానికి సంబంధించిన అంచనాల పునర్నిర్ణయ ప్రతిపాదనలు మూడు మండలాల నుంచి ప్రధాన కార్యాలయానికి పంపిస్తే వాటిని పరిశీలించి త్వరితగతిన ఆమోదం కోసం పంపిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. పనుల నిర్వహణ వ్యవస్థకు సంబంధించి ప్రతి నెలా నిర్ణీత తేదీల్లో సమీక్ష నిర్వహించి సమస్యలు పరిష్కరించేలా మండల కమిషనర్లకు సూచనలు ఇస్తామని కమిషనర్ వెల్లడించినట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు. అదేవిధంగా భద్రతా డిపాజిట్, హామీ డిపాజిట్ విడుదల అంశంపై సంబంధిత ఉన్నతాధికారులకు ఇప్పటికే లేఖ పంపినట్లు, ఆ నిధులు కూడా త్వరలో విడుదలయ్యేలా చర్యలు కొనసాగుతున్నాయని కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో నూతన కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు ముద్దంగుల నరసింహ, కార్యనిర్వాహక అధ్యక్షుడు గండికోట రమేష్, ప్రధాన కార్యదర్శి గండికోట ఆనంద్, కోశాధికారి పోతులూరు వెంకట శివారెడ్డితో పాటు పలువురు కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## ఉప్పుగూడ బోనాలకు డిసిపికి ఆహ్వానం


డీసీపీ కిరణ్ ప్రభాకర్‌ను సన్మానించి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ ప్రతినిధులు

**చాంద్రాయణగుట్ట, జులై 24, ప్రభాతవార్త :** పాతబస్తీ ఉప్పుగూడ శ్రీ మహంకాళి దేవాలయ 77వ వార్షిక బోనాల మహోత్స వాలకు హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని కోరుతూ ఆ ఆలయ కమిటి ప్రతినిధి బృందం శుక్రవారం చార్మినార్ డీసీపీ కిరణ్ ప్రభాకర్ ఖారేను మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. బోనాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ అధ్యక్షులు జనగామ మధుసూదన్‌గౌడ్ ఆలయ చారిత్రక నేపథ్యాన్ని, బోనాల ఉత్స వాల నిర్వాహణను డీసీపీకి వివరించారు. ఈ యేడు అమ్మవారి బోనాల జాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. డీసీపీ వారి ఆహ్వానాన్ని స్వీకరించారు. తప్పని సరిగా ఉత్స వాలలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకుంటానని వారికి హామి ఇచ్చారు. డీసీపీని కలిసిన వారిలో ఆలయ ప్రధాన కార్యదర్శి కీర్తి నరేందర్ ముదిరాజ్, కార్యదర్శులు సుభాష్, హరికృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

**-ఎన్‌టిఏను రద్దు చేయాలి : తెలంగాణ ఎస్ఐఓ డిమాండ్**

**చార్మినార్, జులై 24 ప్రభాతవార్త :** జాతీయ స్థాయి పరీక్షలలో జరుగుతున్న వైఫల్యాలు ,ప్రశ్నపత్రాల లీకేజీలు, పరిపాలన నిర్లక్ష్యం వల్ల దేశ వ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రుల నమ్మకాన్ని దెబ్బ తీశాయని తెలంగాణ రాష్ట్ర స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనేజేషన్ శాఖ అధ్యక్షులు మహ్మద్ ఫరాజ్ అహ్మద్ అన్నారు. ఢిల్లీలో శాంతి యుతంగా నిర్వహిస్తున్న నిరసన కారులపై పోలీసుల దాడిని ఖండిస్తూ విద్యార్థులకు మద్దతుగా ఎస్ఐఓ తెలంగాణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం చార్మినార్ సమీపంలోని పంచ మహల్ వద్ద సంఘీ భావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై బలాన్ని ఉపయోగించడాన్ని ఎస్ఐఓ ఖండిస్తున్నదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఓ తెలంగాణ విభాగానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

## దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంది : సంతోష్ గౌడ్


లంగర్ హౌస్ లో ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని కోరుతూ ప్లే కార్డులతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

**మెహిదీపట్నం, జులై 24, ప్రభాతవార్త :** దేశంలో ప్రజాస్వామ్యం కూని అవుతుందని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కాంగ్రెస్ పార్టీ లంగర్ హౌస్ డివిజన్ అధ్యక్షులు గౌని సంతోష్ గౌడ్ అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీ పై విద్యార్థులు నిరసన తెలుపుతుంటే పోలీసులు విచక్షణారహితంగా లాటి చార్జ్ చేయడం, రాహుల్ గాంధీని అరెస్టు చేయడంపై శుక్రవారం లంగర్ హౌస్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోల్కొండ దేవాలయ మాజీ చైర్మన్ కొండెపూడి చంటిబాబు, గౌని సంతోష్ గౌడ్ లు మాట్లాడుతూ... దేశంలో ప్రజాస్వామ్యానికి రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నీట్ పేపర్ లీకేజీ పై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వారిలో విజయ్, గిరి, షకీలా, దినేష్, అఫ్రోజ్, భవిత కార్యకర్తలు ఉన్నారు.

## నవజాత శిశు మరణాల రేటును తగ్గించడమే లక్ష్యం : డీఎంహెచ్‌ఓ

**మెహిదీపట్నం, జులై 24, ప్రభాతవార్త :** నవజాత శిశు మరణాల రేటును 2027 నాటికి ఖిసింగిల్ డిజిట్‌ఖి స్థాయికి తగ్గించడమే లక్ష్యంగా అందరూ సమన్వయంతో కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం నీలోఫర్ హాస్పిటల్‌లోని నాట్కో ఆడిటోరియంలో ఖిసంకల్ప్‌ఖి ప్రాజెక్టుపై కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... టీచింగ్ హాస్పిటల్స్, వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల వైద్యులు భాగస్వామ్యంతో పని చేయాలన్నారు. పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం, హైరిస్క్ గర్భధారణలు, తీవ్ర రక్తహీనత ఉన్న గర్భిణులను ముందే గుర్తించి ప్రత్యేక చికిత్స అందించడం ద్వారా మరణాలను అరికట్టవచ్చని సూచించారు. అత్యవసర సమయంలో శిశువులను సకాలంలో ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేయాలని స్పష్టం చేశారు. నీలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ... గర్భిణులను ప్రారంభంలోనే నమోదు చేసి సుఖవంతమైన ప్రసవాలు అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, గైనకాలజిస్టులు, పీడియాట్రిషియన్లు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేయాలి

**-జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి**




**అత్తాపూర్ జులై24, ప్రభాతవార్త :** రాబోయే బోనాల పండుగ, మిలాద్‌ఉన్‌నబి పండుగలను పురస్కరించుకుని, రాజేంద్ర నగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం జోన్ పరిధిలోని వివిధ సర్కిళ్ల విభాగాల అధిపతులు, అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బోనాల పండుగ వేడుకలను దృష్టిలో ఉంచుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టాలన్నారు . రహదారులపై ఉన్న గుంతలను వెంటనే పూడ్చివేయాలని సూచించారు. అన్ని వీధి దీపాలు తప్పకుండా వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జోన్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులన్నింటినీ బోనాల పండుగ ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

**మిలాద్ ఉన్ నబీ సందర్భంగా...** రాబోయే మిలాద్‌ఉన్‌నబి పండుగ ఏర్పాట్లపై కూడా ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. పండుగల వేళ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని 6 సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, సూపరింటెండెంట్లు, వివిధ విభాగాల అధికారులు, ఎంటమాలజీ అధికారులు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE ADDL. JUNIOR CIVIL JUDGE CUM -VII ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, RANGA REDDY DISTRICT AT: HAYATHNAGAR
O.S. No. 462 OF 2026

Between:
Nandigama Anantha Laxmi and two others ... PLAINTIFFS
AND
1.The Tahsildar, Abdullapurmet Revenue Mandel, Range Reddy District ... DEFENDANTS
2. All concerned

NOT ICE

That the above named Plaintiffs filed the above suit for Declaration to declare them as legal heirs of deceased Nandigama Prasad S/o. Ramlingaiah Sharma who died intestate on 22-04-2013, leaving behind the Plaintiffs as his surviving legal heirs and successors to succeed his estate against you and others. The said suit is posted on 07-08-2026 for objections. If any person or persons is/are having any objections, he/she/they may appear before the Hon'ble Addl. Junior civil Judge cum-VII Addl Judicial Magistrate of First Class Range Reddy District At Hayathnagar on 07-08-2026 either in person or through an Advocate, failing which the matter will be decided as per law in your absence.

SCHEDULE OF PROPERTY

All that the Portion of open land bearing Plot No.693, admeasuring 200 Square Yards (equivalent to 167.23 Square Metres), situated in Survey No.60 of Turkayamjal Village, formerly within Hayathnagar Revenue Mandel and presently within Abdullapurmet Mandel, Ranga Reddy District, under the jurisdiction of Turkayamjal Gram Panchayat, which was subsequently upgraded as Turkayamjal Municipality, registration sub-District Vanasthalipuram and bounded by: North: Plot No.692 South: Plot No.694 East: Plot No.742 West: 30' wide Road

(BY ORDER OF T. COURT)
(M.RAMESH)
Advocate
Plot.No.25, Adithya Nagar, Guramguda, R.R.Dist-501510.
Cell :9848272998

## జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ



రామకృష్ణకు నియామక పత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూలై 24 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా బిజెపి దళిత మోర్చా ఉపాధ్యక్షుడిగా కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌కు చెందిన యు.రామకృష్ణ నియామకమయ్యారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు పెరిక కృష్ణప్రకాష్ ఆదేశాలు జారీ చేశారు. కృష్ణప్రకాష్ జారీ చేసిన నియామక పత్రాన్ని శుక్రవారం రంగారెడ్డి జిల్లా బిజెపి అర్బన్ అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి రామకృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో బిజెపి బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామన్నారు.

## పడకేసిన పారిశుధ్యం.. అవస్థలు పడుతున్న కాలనీ ప్రజలు




రోడ్డు పక్కన చెత్త పడి ఉన్న దృశ్యం

**ఎల్.బి.నగర్, జూలై 24 ప్రభాతవార్త:** సరైన పారిశుధ్య నిర్వహణ లేకపోవడంతో ప్రజల అవస్థలు పడుతున్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పల దర్శనమిస్తుండడంతో ప్రజలు వ్యాధుల బారిన పడే ప్రమాదం నెలకొంది. నాగోల్ డివిజన్ రాజ్యలక్ష్మికాలనీ, జైపూరీకాలనీలలో ఎప్పటికప్పుడు చెత్త తొలగించకపోవడంతో రోడ్డుపక్కన పెద్దఎత్తున చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. కాలనీలలో చెత్తకుప్పలు పేరుకుపోతున్నడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నాగోల్ సర్కిల్ అధికారులు పారిశుధ్య నిర్వహణపై సరైన దృష్టి సారించకపోవడంతో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. ప్రతిరోజు ఎప్పటికప్పుడు చెత్తను తొలగించకపోవడంతో ఈగలు, దోమలు, క్రిమికీటకాలు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని దీంతో తాము వ్యాధుల బారిన పడతామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ నాగోల్ డివిజన్ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బిఆర్ఎస్‌వి ఆందోళనలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజ్‌గిరి, జూలై 24 ,ప్రభాతవార్త :** ఢిల్లీలో విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న అణచివేత ధోరణి, దాష్టీకానికి నిరసనగా భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (బిఆర్ఎస్‌వి) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌తో కలిసి మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముందు అల్వాల్ సర్కిల్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అల్వాల్ నుంచి ఆనంద్‌బాగ్, మల్కాజ్‌గిరి మీదుగా వందలాది కార్లతో భారీ ర్యాలీగా బయలుదేరి ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌కు చేరుకుని నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల గొంతును అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, శాంతి శ్రీనివాస్ రెడ్డి, మురుగేష్, నాయకులు జేపీసీ వెంకన్న, తోట నరేందర్ రెడ్డి, జీకే హనుమంతరావు, మేకల రాము యాదవ్, అనిల్ కిషోర్ గౌడ్, అమీనుద్దీన్, డోలి రమేష్, శ్రీధర్ గౌడ్, సురేష్, భాస్కర్ రెడ్డి, అరవింద్, శ్రీనివాసులు, ప్రభాకర్ గౌడ్, చిన్న యాదవ్, శివ గౌడ్, సాయి గౌడ్, సుమన్ గౌడ్, చిందం శ్రీనివాస్, నిర్ణీత్ రెడ్డి, హేమంత్ రెడ్డి, వంశీ ముదిరాజ్, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, గౌస్ ఇమ్రాన్, నర్సింగ్ రావు, శోభా విద్యార్థులు,యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : వనిపల్లి



ఎస్‌సి మోర్చా కార్యవర్గ సభ్యులకు నియామకపుపత్రాలు అంగజేస్తున్న వనిపల్లి

**వనస్థలిపురం జూలై 24,ప్రభాతవార్త** పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త బూత్ స్థాయి నుండి పనిచేయాలని రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.వనస్థలిపురం లోని జిల్లా బి.జె.పి.కార్యాలయంలో శుక్రవారం ఎస్.సి.మోర్చా కార్యవర్గ సబ్యులకు నియామపు పత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వనిపల్లి మాట్లాడుతూ పనిచేసే కార్యకర్తలకు పార్టీ పదవులు లభిస్తాయన్నారు. కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెల్లి ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. రంగారెడ్డి జిల్లా అర్బన్ ఎస్.సి.మోర్చా అధ్యక్షుడు కృష్ణప్రకాశ్ మాట్లాడుతూ రాష్ట్ర ఎస్.సి.మోర్చా అధ్యక్షుడు కాంతి కిరణ్ సూచనలతో జిల్లాలో ఎస్. సి.సంక్షేమ పథకాలను విస్తృతంగా నిర్వహించాలని కోరారు. ప్రభుత్వం ఎస్.సి.లకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలని కోరారు.ఈకార్యక్రమంలో బండారి భాస్కర్,యష్పాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్ మండలంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం




విద్యా సంస్థలను బంద్ చేసి ప్రదర్శన నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ, పివైఎల్ నాయకులు

**సరూర్‌నగర్, జూలై 24 ప్రభాతవార్త:** నీట్ పరీక్షా పత్రం లీకేజీ, ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జికి వ్యతిరేకంగా శుక్రవారం నిర్వహించిన విద్యా సంస్థల బంద్ బాలాపూర్ మండలంలో విజయవంతం అయ్యింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, పివైఎల్ తదితర విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మండలంలోని బడంగ్‌పేట్ పాలిటెక్నిక్, డిగ్రీ కాలేజీలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశా లలను బంద్ చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొల్లూరు భీమేష్, దాసరి అఖిల్, కిరణ్, మనోహర్, అక్కి శివలతో పాటు పలువురు పాల్గొని బంద్ విజయవంతానికి కృషి చేశారు.

## విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ రాజకీయాలు చేస్తోంది : బిజెపి



నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్, మల్లెల నర్సింగ్ రావు తదితరులు

**నాచారం, జులై 24 ప్రభాతవార్త :** నీట్ అంశంలో విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేస్తోందని ఆరోపిస్తూ బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల నర్సింగ్ రావు ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు నాచారం ప్రధాన రహదారిపై నిరసన ర్యాలీ నిర్వహించారు. రాహుల్ గాంధీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. అనంతరం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా నాచారం పోలీసులు అడ్డుకోవడంతో కొంతసేపు బీజేపీ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ నీట్ ప్రశ్నపత్రం లీకేజీ ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే కేంద్ర ప్రభుత్వం పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించి ఫలితాలను ప్రకటించిందని తెలిపారు. అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ విద్యార్థులను రెచ్చగొట్టి వారి భవిష్యత్తుతో రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. పునఃపరీక్ష అనంతరం దేశవ్యాప్తంగా విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీకి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చట్టాన్ని తీసుకురానున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిందని ఆయన గుర్తుచేశారు. విద్యార్థులను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించడం సరికాదని, కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని మార్చుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్ ఉపాధ్యక్షులు సాయి గౌడ్, మెడల దయ గౌడ్, వెంకట్ నాయక్, అభిషేక్ గౌడ్, గోపాల్ గౌడ్, నవీన్ గౌడ్, బాలకృష్ణ, నవీన్, బాలు, శ్రీధర్ రెడ్డి ,డివిజన్ల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి : రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి



**అబ్దుల్లాపూర్‌మెట్ , జూలై 24 ప్రభాతవార్త :** జర్నలిస్టులు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుని తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీ యూడబ్ల్యూజే) రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో శుక్రవారం టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టుల కోసం కామినేని ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం, మండల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. సమాజ శ్రేయస్సు కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు కనీస సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. జర్నలిస్టులకు కార్పొరేట్ వైద్యం అందేలా ఉచిత హెల్త్ కార్డులను పునరుద్ధరించాలని, వారి కుటుంబాలకు భరోసా కల్పించే గ్రూప్ ఇన్సూరెన్స్ (ప్రమాద బీమా) సౌకర్యాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి యూనియన్ తరపున ఎల్లప్పుడూ ముందుంటామన్నారు. యూనియన్‌లో ఉన్న ప్రతి జర్నలిస్టు యూనియన్ బలోపేతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎండీ సలీమ్ పాషా, ప్రధాన మేకల సత్యనారాయణ, జిల్లా కోశాధికారి సంరెడ్డి శశిపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జెనిగె పాండు, రాష్ట్ర కౌన్సిల్‌సభ్యుడు ప్రవీణ్, సీనియర్ జర్నలిస్టులు జాల కిషన్, అనంతుల శ్రీనివాస్, సోలిపురం రజనీకాంత్‌రెడ్డి, వర్దెల్లి దశరథ, రచ్చా శేఖర్, ఆంజనేయులు, అవంచ సురేందర్‌లతో పాటు వైద్యులు దివ్యారెడ్డి, శ్రేయాన్,మార్కెటింగ్ టీం సందీప్, శ్రీధర్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

### నూతన మండల కమిటీ ఏర్పాటు

టీయూడబ్ల్యూజే అబ్దుల్లాపూర్‌మెట్ మండల నూతన అధ్యక్షుడిగా గూడెపు జగన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా నామా ఆంజనేయులు, గౌరవాధ్యక్షుడిగా శ్రీరాం యాదయ్య, ఉపాధ్యక్షులుగా కట్టంగూరు మల్లేష్, గండికోట సత్యం, నాగార్జున, జాయింట్ సెక్రటరీలుగా చెరుకు ఉపేందర్, పొలగోని రాజేష్, కుకుట్లపల్లి రాకేష్, కోశాధికారిగా బండ శేఖర్‌రెడ్డి, సలహాదారులుగా గడ్డం భాస్కర్‌రెడ్డి, రాసాల వెంకటేష్‌యాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఉప్పల్‌లో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



ఉప్పల్‌లో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బిజెపి నేతలు మార్నెని పణీందర్, డా.శిల్పారెడ్డి తదితరులు

**ఉప్పల్, జూలై 24 ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు శుక్రవారం ఉప్పల్ డివిజన్ అధ్యక్షులు మారినేని ఫణింద్ర ఆధ్వర్యంలో ఉప్పల్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా డా.మేకల శిల్పారెడ్డి, మార్నెని ఫణీంద్ర మాట్లాడుతూ ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ ఇల్లు ముట్టడించిన కారణంగా దేశ భద్రత ప్రతిష్ట విషయంలో రాహుల్ గాంధీ చేపడుతున్న కార్యకలాపాలకు వ్యతిరేకంగా రాహుల్ దిష్టిబొమ్మ దహనం చేసినట్లు తెలిపారు. ఢిల్లీలో విద్యార్థుల ప్రయోజనాల కోసం చేస్తున్న నిరసన కాదని, ఇది పూర్తిగా విదేశీ నిధులు సమకూర్చబడి భారతదేశ అభివృద్ధిని అడ్డుకునేందుకు చేస్తున్న కుట్ర అన్నారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని లక్ష్యంతో దేశంలోనే ఉన్న దేశద్రోహులచే నిర్వహించబడుతున్న చర్య అని అన్నారు ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా.మేకల శిల్పా రెడ్డి, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్, గోనె శ్రీకాంత్, యు. బలవంతాచారి, ప్రధాన కార్యదర్శులు తీగ విట్టల్ రావు, నామ శ్రవణ్, సీనియర్ నాయకులు నర్సిరెడ్డి, టి శ్రీనివాస్ గౌడ్, చోలేటి బ్రహ్మచారి, మహిళా మోర్చా నాయకురాలు మద్దెల పద్మ, యువమోర్చా అధ్యక్షులు ఆడెపు రమేష్, దళిత మోర్చా అధ్యక్షులు జయరాం, గిరిజన మోర్చా అధ్యక్షులు రాజు నాయక్, ఓబీసీ మర్చ ప్రధాన కార్యదర్శి అనంతు గురవయ్య, మామిళ్ళ బాలరాజు, వెంకట్, నరసింహ గౌడ్, నవత, నవీన్, మనోహర్, గుమ్మిడెల్లి శ్రీకర్, అభిరామ్, రామ్ నివాస్, రవితేజ, సుమంత్, అరుణ్, కిషన్ నాయక్, మమత, జ్యోతి, శారద,సౌజన్య, ప్రభ విజేత,గణేష్ యాదవ్, శ్రీనివాస్ నాయక్, స్వామి గౌడ్, తదితరులు పాల్గొన్నారు

## పరిశుభ్రత, అక్రమణల తొలగింపు నిబంధనలు కచ్చితంగా పాటించాలి : కమిషనర్



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

**హయత్ నగర్, జులై 24 ప్రభాతవార్త :** పరిశుభ్రమైన రహదారులు, ఆక్రమణల రహిత ప్రజా ప్రదేశాలు, పచ్చదనం, నిబంధనల కచ్చితమైన అమలే మెరుగైన పట్టణ నిర్వహణకు పునాది అని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన హయత్‌నగర్ సర్కిల్-14 పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధం, రహదారుల నిర్వహణ, పచ్చదనం, ఆక్రమణలు, వాణిజ్య సంస్థల ట్రేడ్ లైసెన్సులను పరిశీలించి సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. తనిఖీ సందర్భంగా రహదారుల పక్కన పేరుకుపోయిన అదనపు రోడ్ సైడ్ బెర్మ్‌ను తొలగించి, రోడ్డు మార్జిన్లను శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. రహదారులు, పరిసర ప్రాంతాల్లో చెత్త పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. రహదారుల వెంట ఏర్పాటు చేసిన ప్లాంటర్ బాక్స్‌లను పరిశీలించిన ఆయన అందుబాటులో ఉన్న ప్రతి ప్లాంటర్ బాక్స్‌లో మొక్కలు నాటి వాటి సంరక్షణను క్రమం తప్పకుండా చేపట్టాలని ఆదేశించారు. మొక్కలు లేకుండా నిరుపయోగంగా ఉన్న ప్లాంటర్ బాక్స్‌లను వెంటనే తొలగించి, ప్రజా స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా చూడాలని స్పష్టం చేశారు. ప్రజా రహదారులను ఆక్రమిస్తూ నిర్మించిన అనధికార ర్యాంపులను తక్షణమే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాదచారులు, వాహనదారుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలన్నారు. అన్ని వాణిజ్య సంస్థలు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందాలని, ఇప్పటికే లైసెన్స్ పొందిన వ్యాపారులు తమ దుకాణాలు, వాణిజ్య సంస్థల్లో ప్రజలకు స్పష్టంగా కనిపించే వాటిని ప్రదర్శించాలని ఆదేశించారు. నిబంధనలను పాటించని వాణిజ్య సంస్థలను గుర్తించి చట్టప్రకారం చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు

## నూతన డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులు అందరినీ సమన్వయం చేసుకోవాలి: తీగల



తీగల కృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన నూతన డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులు: చిత్రంలో సిద్దాల దశరథ, పల్లె పాండుగౌడ్, కుంచె నాగేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**సరూర్‌నగర్, జూలై 24 ప్రభాతవార్త:** కొత్తగా నియమితులైన డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు స్థానిక పార్టీ నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకొంటూ ముందుకు సాగాలని మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే, హైదరాబాద్ మాజీ మేయర్, మాజీ హుడా ఛైర్మన్ తీగల కృష్ణారెడ్డి సూచించారు. మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని మీర్‌పేట్, జిల్లెలగూడ, ప్రశాంతి హిల్స్ మున్సిపల్ డివిజన్లకు నూతనంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన చల్లా బాల్‌రెడ్డి, సిద్దాల శ్రీశైలం, ఏడుదొడ్ల సురేందర్‌రెడ్డిలు శుక్రవారం మీర్‌పేట్ మేడిబౌలిలోని తీగల క్యాంపు కార్యాలయానికి తరలివెళ్ళి టికెఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ మేరకు వారు ఉమ్మడిగా తీగలను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా టికెఆర్ మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో మున్సిపల్ డివిజన్లకు కొత్త అధ్యక్షులుగా నియమితులైన వారికి అభినందనలు తెలిపారు. పదవులు ఎవరికైనా అలంకార ప్రాయం కారాదనీ వాటికి న్యాయం చేయాలని సూచించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి అర్హులకు లబ్ధి చేకూరేలా కృషి చేయాలని ఆయన అన్నారు. అదే విధంగా నిత్యం ప్రజల్లో తిరుగుతూ స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించి పార్టీకి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ సరూర్‌నగర్ మండల పరిషత్ ఎంపిటిసిల ఫోరం మాజీ అధ్యక్షుడు, జిల్లెలగూడ మాజీ ఎంపిటిసి సిద్దాల దశరథ, భాగ్యనగర్ సొసైటీ మాజీ డైరెక్టర్ కుంచె నాగేందర్‌గౌడ్, మీర్‌పేట్ మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్ పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ సాఫీగా సాగేలా చూడాలి : రజిత రెడ్డి

**రామంతాపూర్, జులై 24 ప్రభాతవార్త :** సర్ ప్రక్రియ సాఫీగా, వేగవంతంగా సాగేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పని చేయాలని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రామం తపూర్ గాంధీనగర్ ఫంక్షన్ హాల్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ సహాయ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ నిజమైన ఓటర్లకు సర్ ప్రక్రియతో ఎలాంటి నష్టం లేకుండా చూడాలని కోరారు. బీఎల్ఓతో సమన్వయం చేసుకుంటూ ఓటర్లకు సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామంతపూర్ డివిజన్ అధ్యక్షులు సందీప్, లూకాస్, సత్తి రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, భాస్కర్, బుల్లెట్ అశోక్, అలీమ్, రత్నా రెడ్డి, రాఘవేందర్, లక్ష్మా రెడ్డి, పూస శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి, భాస్కర్, లూర్ధు రెడ్డి, రాజు, వినయ్, వినోద్, సంతు, రాజు, పాండు, శ్రీనివాస్, మహేష్, రాము, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి: చేకోలేకర్ శ్రీనివాస్



ఎస్ఐఆర్ హైదరాబాద్ నోడల్ అధికారి రవికిరణ్ , డిప్యూటీ కమిషనర్ అలివేలు మంగతాయారులతో కలిసి సలీంనగర్‌లో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న చెకోలేకర్ శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట, జూలై 24, ప్రభాతవార్త:** ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మలక్ పేట సలీం నగర్ లో ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ కేంద్రాన్ని ఎస్ఐఆర్ హైదరాబాద్ నోడల్ అధికారి రవికిరణ్, ముసారాంబాగ్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అలివేలు మంగతాయారు, సైదాబాద్ మండల తాహసిల్దార్ మణిపాల్ రెడ్డి తదితరులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎస్ఐఆర్ గురించి మలక్ పేట నియోజకవర్గం లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమలను నిర్వహిస్తున్నమని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత ముఖ్యమైనదని, ప్రతి అర్హత కలిగిన వ్యక్తి తమ పేరు తప్పనిసరిగా జాబితాలో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. తమ పేర్లతో పాటు కుటుంబంలోని ప్రతి సభ్యుల పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వినియోగించుకుని ఓటర్లు తమ వివరాలను సరిచేసుకోవాలని కోరారు. ఆగస్టు 3వ తేదీ వరకు ఎస్ఐఆర్ కార్యక్రమం పొడిగించడం జరిగిందని వివరించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుపర్ వైజర్లు శ్రవన్ కుమార్, అజీజ్ ఉల్లా తదితరులు పాల్గొన్నారు.

## సమాజానికి తమ వంతు సేవలు : రత్న ప్రసాద్




విద్యార్థినులకు గొడుగులను పంపిణీ చేస్తున్న రత్న ప్రసాద్, ఎన్ఎస్‌యూఐ నాయకుడు మహమ్మద్ సోహైల్ ఉద్దీన్ తదితరులు

**మలక్ పేట, జూలై 24, ప్రభాతవార్త:** సమాజానికి తమ వంతు సేవలను అందిస్తున్నామని కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వాహకులు రత్న ప్రసాద్ పేర్కొన్నారు. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్వాహకులు రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో మూసారాంబాగ్‌లోని ఏకాక్ష్ స్కూల్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పేద శ్రామిక మహిళలు,పాఠశాలకు వెళ్లే బాలికలకు 100 గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వర్షాకాలంలో వర్షం నుంచి వేసవిలో ఎండ నుండి రక్షణ కల్పించే ఉద్దేశ్యంతో ఈ గొడుగులను పంపిణీ చేసినట్లు తెలిపారు. నిరంతరం సేవా కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. సమాజంలో నిరుపేదలు, అవసరమైన వారికి సేవలందించడం సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఏకాక్ష్ స్కూల్ ప్రధానో పాధ్యాయురాలు వి.దీపా,ఎన్ఎస్‌యూఐ నాయకుడు మహమ్మద్ సొహైల్ ఉద్దీన్,కమిటీ సభ్యులు,పాల్గొన్నారు.

## వెంకటసాయినగర్‌లో కల్వర్టు పనులు



వెంకటసాయినగర్ కాలనీలో కల్వర్టు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**రామంతాపూర్, జూలై 24 ప్రభాతవార్త :** రామంతాపూర్ వెంకట సాయి నగర్ కాలనీలో రూ.30 లక్షలతో బాక్స్ కల్వర్టు పనులను శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వెంకట సాయి నగర్ కాలనీ అభివృద్ధికి తను పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. కాలనీలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ లైన్ల పనులను త్వరలోనే పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. కాలనీ అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజీ పడబోమని, అవసరమైన నిధులను మంజూరు చేయించి అన్ని అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గంధం నాగేశ్వరరావు, ఎండి జహంగీర్, డాక్టర్ బి వి చారి, కాలనీ అధ్యక్షుడు ఎ. విజయేందర్ రెడ్డి, సర్వ సత్తయ్య యాదవ్, రమేష్ గౌడ్, ఎం.రవికుమార్, సంజీవ్, శివశంకర్, ఆర్. గోవింద్, జి. అశోక్, సిహెచ్. శ్రీనివాస్ గౌడ్, కే. నవీన్ కుమార్, భూపతి నరసింహ గౌడ్, విద్యాసాగర్, రామకృష్ణ, వి.శివకుమార్, ఎం.ఐలేష్ యాదవ్, బి.చలపతి రావు, బి.రాములు గౌడ్, ఎం.రమేష్ యాదవ్, రమేష్ శెట్టి, హరీష్, వేణుగోపాల్ రెడ్డి, సోమేష్, రాములు, స్వామి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్ డివిజన్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన



ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలిస్తున్న చిగిరింత నర్సింహారెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జూలై 24 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ డివిజన్‌లో జరుగుతున్న ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ) కార్యక్రమాన్ని కాంగ్రెస్ బృందం పరిశీలించింది. పార్టీ తరపున డివిజన్ ఎస్ఐఆర్ పరిశీలకునిగా వచ్చిన సురేష్‌రెడ్డితో కలిసి బడంగ్‌పేట్ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చిగిరింత నర్సింహారెడ్డి, డివిజన్ కాంగ్రెస్ నూతన అధ్యక్షుడు నీరుడు శ్రీరాములు, బాలాపూర్ మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చిగిరింత దయాసాగర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు బాల్‌నింగని జంగయ్య, గొరిగె శ్రీశైలం, టేకుల సుధాకర్‌రెడ్డి తదితరులు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్ఓతో మాట్లాడి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రోగ్రెస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇక్కె శ్రీనివాస్, బద్దం రాముగౌడ్, ఇక్కె కొండల్, సంరెడ్డి మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా ఇన్వెస్టిచర్ వేడుక




కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య తదితరులు

**నాచారం జులై 24 , ప్రభాతవార్త :** సత్ప్రవర్తన, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగితే విద్యార్థులు ఉత్తమ నాయకులుగా ఎదుగుతారని టీచర్ ఎమ్మెల్సీ, డీపీఎస్-పల్లవి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్స్ చైర్మన్ మల్కా కొమరయ్య అన్నారు. శుక్రవారం నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ-2026 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో భారత సైన్యానికి చెందిన బ్రిగేడియర్ వినీత్ పురి, భారత నౌకాదళానికి చెందిన కమోడోర్ తిరుసంగు కూడా పాల్గొన్నారు.విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని, సమయపాలన, నిబద్ధత, క్రమశిక్షణతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మల్కా కొమరయ్య సూచించారు. నాయకత్వం ఎవరూ ఇచ్చేది కాదని, అది వ్యక్తి ప్రవర్తన, విలువలు, అంకితభావంతో సహజంగా ఏర్పడేదని అన్నారు. రక్షణ దళాల్లో చేరాలనుకునే విద్యార్థులు ఇప్పటి నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు.విద్యార్థులను చూస్తుంటే తమ చిన్ననాటి రోజులు గుర్తుకు వచ్చాయని బ్రిగేడియర్ వినీత్ పురి, కమోడోర్ తిరుసంగు పేర్కొన్నారు. విద్యార్థుల ఆసక్తులను గుర్తించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తే వారు తమ లక్ష్యాలను సులభంగా చేరుకోగలరని అన్నారు. అనంతరం విద్యార్థులతో జాతీయ సేవా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డీపీఎస్ ఆడిటోరియంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ప్లే స్కూల్ చిన్నారుల వినూత్న వేషధారణలో చేసిన నృత్యాలు, కరాటే విన్యాసాలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తా : మాజీ కార్పొరేటర్



న్యాయవాదులతో కలిసి సమస్యలను పరిశీలిస్తున్న నవ జీవన్ రెడ్డి

**హయత్ నగర్, జులై 24 ప్రభాతవార్త :** ప్రజలకు అసౌకర్యం కలగకుండా అవసరమైన మరమ్మతులు చేపట్టి డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని హయత్ నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హయత్ నగర్ కోర్టు పరిసరాలలో డ్రైనేజీ అవుట్ లెట్లు సరిగా లేకపోవడం, వరదనీటి అవుట్‌లెట్లు మూసుకుపోవడం, వీధి దీపాలు వెలగక పోవడంతో తమతో పాటు కోర్టుకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు న్యాయవాదులు సమస్యను మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గారి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన శుక్రవారం జలమండలి, స్ట్రీట్ లైట్ విభాగం సిబ్బందితో కలిసి కోర్టు పరిసర ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించడం ప్రజాప్రతినిధి బాధ్యతని, ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తానన్నారు.కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ప్రియాంక, హయత్ నగర్ కోర్ట్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రవీణ్ కుమార్ పంతులు, రామ్మోహన్,భార్గవి, శివ పాల్గొన్నారు.

## నేడు సత్యదేవుడి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు



రామంతాపూర్‌లో కొలువుదీరిన శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి వారు దృశ్యం.

**రామంతాపూర్, జూలై 24 ప్రభాతవార్త :** రామంతాపూర్ ఇందిరానగర్‌లోని శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం 10 గంటలకు లక్షపుష్పార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ సభ్యుడు కోట్ల నర్సింహారెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి ఇ.ఎన్. విజయభారతి తెలిపారు. హిందూ వైదిక సంప్రదాయంలో ఏకాదశికి విశిష్టమైన ప్రాధాన్యం ఉందని, సంవత్సరంలో వచ్చే 24 ఏకాదశుల్లో ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి, వైకుంఠ ఏకాదశి అత్యంత పవిత్రమైన పర్వదినాలుగా భావిస్తారని పేర్కొన్నారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున శ్రీమన్నారాయణుడు పాలకడలిలో ఆదిశేషునిపై శయనిస్తాడనే విశ్వాసంతో దీనిని శయన ఏకాదశిగా ఆచరిస్తారని తెలిపారు. ఇదే దక్షిణాయన ప్రారంభాన్ని సూచించే పవిత్రమైన సందర్భంగా భక్తులు విశేషంగా పూజలు నిర్వహిం చడం ఆనవాయితీ అని వివరించారు. ఈ సందర్భంగా నిర్వ హించే లక్షపుష్పార్చన, ప్రత్యేక అర్చనలు, పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీమన్నారాయణుని కృపాక టాక్షాలు పొందాలని సూచించారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాన్ని సందర్భంగా ముస్తాబు చేస్తున్నారు. భక్తులకు ప్రత్యేక పూజలు ఉంటాయని తెలిపారు.



ఆషాఢ మాసం సందర్భంగా సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేసిన మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అందెల శ్రీరాములు యాదవ్



బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో విద్యా సంస్థల బంద్ సందర్భంగా తెరిచి ఉంచిన కాలేజీ ఆవరణలో బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు